ప్రభాత జాగృతి

ఇది ప్రజా సమస్యల... పరిష్కార సారథి

ప్రజా చైతన్య.. రథ సారథి

www.prabhathajagruthi.com

సంపుటి: 00 సంచిక: 178

12.03.2026

గురువారం


# ఇండియా ఫస్ట్ మా నినాదం

- పశ్చిమాసియా సంక్షోభం వేళ ఎవరూ ఆందోళన చెందొద్దు
- తిరుచిరాపల్లి ఎన్డీఏ ర్యాలీలోమోడీ భరోసా
- రూ. 5,650 కోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రారంభించిన ప్రధాని
- ఒకే కుటుంబం చుట్టూ డీఎంకే అధికారం
- భారతీయులను సురక్షితంగా రక్షించుకున్న చరిత్ర మాది

**ప్రభాత జాగృతి, తిరుచిరాపల్లి:**



పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాల కారణంగా ప్రపంచ ఇంధన సరఫరా గొలుసు తీవ్రంగా దెబ్బతిన్నప్పటికీ, భారత్ ఈ సంక్షోభాన్ని సమర్థవంతంగా ఎదుర్కొంటుందని ప్రధాని నరేంద్ర మోడీ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం తమిళనాడులోని తిరుచిరాపల్లిలో జరిగిన భారీ ఎన్డీఏ బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ.. తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ 'ఇండియా ఫస్ట్' అనే సిద్ధాంతానికి కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. ఇజ్రాయెల్అమెరికా, ఇరాన్ మధ్య ఘర్షణల వల్ల ముఖ్యంగా ఎల్పీజీ, చమురు దిగుమతులకు ఏర్పడిన అంతరాయంపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ఆయన తోసిపుచ్చారు. దేశంలో ఇంధన కొరత ఏర్పడుతుందనే వదంతులను నమ్మవద్దని, కేవలం ధృవీకరించబడిన సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గతంలో కొవిడ్ మహమ్మారిని దేశం ఎంత పరిణతితో ఎదుర్కొందో, ఈ అంతర్జాతీయ సంక్షోభాన్ని కూడా అదే స్ఫూర్తితో అధిగమిస్తామని మోడీ భరోసా ఇచ్చారు.

మిగతా 2లో..



# ఇరాన్ టెక్ వార్

## ఇజ్రాయెల్‌పై 300 బాలిస్టిక్ క్షిపణులతో ఇరాన్ విరుచుకుపడింది

- గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజాల మౌలిక వసతులపై ఐఆర్జీసీ కన్నేసింది
- గల్ఫ్ దేశాల్లోని ఆర్థిక సంస్థలను దెబ్బతీస్తామని ఇరాన్ హెచ్చరిక
- సౌదీ అరేబియా చమురు క్షేత్రాలపై డ్రోన్ దాడులు, ప్రపంచ ఇంధన సరఫరాకు ముప్పు
- క్లస్టర్ బాంబు వార్‌హెడ్లతో విచక్షణారహితంగా దాడులు చేస్తున్న ఇరాన్
- ఇరాన్ దాడుల వల్ల ఇజ్రాయెల్‌లో ఇప్పటివరకు 12 మంది మృతి

**ప్రభాత జాగృతి,అంతర్జాతీయం:**

ఇరాన్ సైన్యం తాజాగా ఇరాక్, బహ్రెయిన్, ఇజ్రాయెల్‌లను లక్ష్యంగా చేసుకుని భారీ ఎత్తున క్షిపణులను ప్రయోగించింది. ఇజ్రాయెల్ గగనతల రక్షణ వ్యవస్థలు ఈ క్షిపణులను అడ్డుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నప్పటికీ, టెల్ అవీవ్‌లోని ఒక ప్రాంతాన్ని క్షిపణి తాకినట్లు సమాచారం అందుతోంది. ఇజ్రాయెల్ ఛానల్ 12 కథనం ప్రకారం, కేవలం గంట వ్యవధిలోనే ఇరాన్ రెండో విడత క్షిపణి దాడులకు తెగబడింది. దీంతో మధ్య ఇజ్రాయెల్ అంతటా ప్రమాద హెచ్చరిక సైరన్లు మారుమోగాయి. అయితే మెజారిటీ క్షిపణులను తమ ఐరన్ డోమ్ వంటి వ్యవస్థలతో అడ్డుకున్నామని, ప్రాణనష్టం జరగలేదని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ ధీమా వ్యక్తం చేస్తున్నా, క్షేత్రస్థాయిలో ఉద్రిక్తత మాత్రం ఏమాత్రం తగ్గలేదు. ఈ దాడుల వెనుక ఇరాన్ తన సైనిక సామర్థ్యాన్ని ప్రదర్శిస్తోంది. ముఖ్యంగా 'ఖోరంషహర్' అనే సూపర్ క్షిపణులను ఇరాన్ ఈ యుద్ధంలో ప్రయోగిస్తోంది. ఇజ్రాయెల్, అమెరికా బేస్‌లపై 37వ విడత దాడులను పూర్తి చేసినట్లు ఐఆర్జీసీ గర్వంగా ప్రకటించింది. సుమారు మూడు గంటల పాటు నిరంతరాయంగా ఈ దాడులు కొనసాగాయంటే

మిగతా 2లో..

మధ్యప్రాచ్యం మరోసారి రణభూమిని తలపిస్తోంది. ఇజ్రాయెల్, అమెరికా స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ తన ప్రతీకారేచ్ఛను క్షిపణి రూపంలో ప్రదర్శిస్తోంది. కేవలం సైనిక స్థావరాలకే పరిమితం కాకుండా, ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన టెక్నాలజీ దిగ్గజ సంస్థలను కూడా యుద్ధ పరిధిలోకి లాగడం సంచలనంగా మారింది. ఇజ్రాయెల్‌కు సాంకేతిక తోడ్పాటు అందిస్తున్నాయనే నెపంతో గూగుల్, మైక్రోసాఫ్ట్, ఐబీఎమ్, ఎన్‌వీడియా వంటి దిగ్గజ సంస్థల డేటా సెంటర్లు, క్లౌడ్ సర్వర్లే లక్ష్యంగా దాడులు చేస్తామని ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్ కోర్ ప్రకటించడం ప్రపంచాన్ని ఆందోళనలో పడేసింది. ఈ పరిణామం కేవలం భూభాగాల యుద్ధం మాత్రమే కాదు, డిజిటల్ మౌలిక సదుపాయాలపై జరిగే భారీ దాడిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు.

# ఫిరాయింపులకు పాత్రధారి, సూత్రధారి కేసీఆరే

- నైతిక విలువలు కడియంకేనా.. కేసీఆర్‌కు వర్తించావా?
- అనర్హత పిటిషన్‌కు అర్హత లేదు.. స్పీకర్ తీర్పును స్వాగతిస్తున్నాం
- బీఆర్ఎస్ నియామవళి ప్రకారం షోకాజ్ నోటీసులిచ్చి వివరణ తీసుకోవాలి
- ఆ పార్టీ ఎందుకు పిటిషన్ వేయలేదు?
- బీఆర్ఎస్ఎల్పీ సభ్యత్వ రుసుము నెలకు రూ.5వేలు
- కేసీఆర్ తప్పు చేశానని క్షమాపణ చెబితే మరుక్షణమే రాజీనామా చేస్తా
- స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**ప్రభాత జాగృతి, స్టేషన్ ఘనపూర్:**



పార్టీ ఫిరాయింపుల విషయంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణలో రాజకీయ వ్యవస్థను భ్రష్టుపట్టించారని, ఆయన స్వయంగా ప్రజలకు క్షమాపణ చెబితే తాను ఆ మరుక్షణమే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ప్రజా క్షేత్రంలోకి వెళ్తానని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సవాల్ విసిరారు. తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పే ధైర్యం కేసీఆర్‌కు ఉందా అని ఆయన ప్రశ్నించారు. బుధవారం స్టేషన్ ఘనపూర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పార్టీ ఫిరాయింపులపై దాఖలైన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లను డిస్మిస్ చేస్తూ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని తెలిపారు. పార్టీ ఫిరాయింపుల పిటిషన్లు చట్టబద్ధం కావని,

మిగతా 2లో..

# రైతు భరోసాపై కీలక ప్రకటన

- రైతు భరోసాపై కీలక ప్రకటన చేసిన మంత్రి వివేక్
- మార్చి నెలాఖరు నుంచే నిధులు జమ
- రూ.9 వేల కోట్లు అందజేస్తామని హామీ




# పెట్రోల్, గ్యాస్ కొరతపై రాష్ట్రాలకు కేంద్రం కీలక ఆదేశం

- ఇంధన కొరతపై పుకార్లకు కేంద్రం స్పష్టత
- పెట్రోల్, డీజిల్ అక్రమ నిల్వలపై కఠిన చర్యల హెచ్చరిక
- రాష్ట్రాలకు కేంద్రం కీలక ఆదేశాలు
- భారత్‌కు ముడిచమురు సరఫరా సజావుగా కొనసాగుతోంది




# తెలంగాణలో మరో డిస్కం ఏర్పాటు

**ఈ కొత్త సంస్థకు సీఎండీగా ముషారఫ్ అలీ ఫరూఖీ నియామకం**

**రైతులకు ప్రయోజనకరంగా కొత్త డిస్కం**

**ప్రభాత జాగృతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు రాష్ట్రంలో మూడో డిస్కమ్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే పనిచేస్తున్న టీజీఎస్పీడీసీఎల్, టీజీఎన్పీడీసీఎల్ సం స్థలకు అదనంగా కొత్త డిస్కమ్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ కొత్త సంస్థకు అనే పేరు పెట్టారు. దీనిని సాధారణంగా 'రైతు డిస్కమ్'గా కూడా పిలుస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం.. ఈ సంస్థను కంపెనీస్ యాక్ట్-2013 ప్రకారం నమోదు చేయనున్నారు. హైదరాబాద్‌లోని మింట్ కంపౌండ్ ప్రాంతంలో ఈ సంస్థ ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేయనున్నారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థలో పెరుగుతున్న అవసరాలను దృష్టిలో

మిగతా 3లో..





# తెలంగాణ, ఏపీ మధ్య గ్రీన్ ఫీల్డ్ హైవే

- రెండు తెలుగు రాష్ట్రాలను కలుపుతున్న హైవే
- ఖమ్మం నుంచి దేవరపల్లి వరకు రాకపోకలు
- జూన్ నెలలో అందుబాటులోకి రానున్న గ్రీన్ ఫీల్డ్ హైవే

02



# 'రాహుల్ దేశంలోనే అతిపెద్ద జోకర్'

- పార్టీ ఫిరాయింపులపై రాహుల్ గాంధీ మాటలకు, కాంగ్రెస్ చేతలకు పొంతన లేదు
- దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయకపోవడం అప్రజాస్వామికం
- తెలంగాణ స్పీకర్ నిర్ణయం వెనుక రాహుల్ గాంధీ ఒత్తిడి, ప్రమేయం ఉంది
- రాజ్యాంగం పట్టుకుని తిరిగే రాహుల్, ఫిరాయింపుల ద్వారా దానిని ఖూనీ చేస్తున్నారు
- రాష్ట్రం నుంచి వెళ్తున్న నిధుల కోసమే రాహుల్ ఇలాంటి అనైతికతకు పాల్పడుతున్నారు
- ప్రజాస్వామ్యంపై జరుగుతున్న ఈ దాడిని ప్రజల ముందు ఎండగడతాం




**ప్రభాత జాగృతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ రాజకీయాల్లో ఫిరాయింపుల వ్యవహారం మరోసారి కార్చిచ్చు రాజేసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి, పట్టపగలే కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుని, ఏకంగా ఆ పార్టీ బీఫారంపై ఎంపీగా పోటీ చేసిన దానం నాగేందర్ విషయంలో అసెంబ్లీ స్పీకర్ ఇచ్చిన తీర్పు రాజకీయ వర్గాల్లో సంచలనం సృష్టిస్తోంది. ఈ నిర్ణయంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. స్పీకర్ నిర్ణయం వెనుక అసలు సూత్రధారి రాహుల్ గాంధీ అని, ఆయన కనుసన్నల్లోనే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా ఈ ప్రక్రియ జరిగిందని తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. దేశవ్యాప్తంగా రాజ్యాంగ పరిరక్షణ గురించి గొప్పలు చెప్పుకునే రాహుల్ గాంధీకి, తెలంగాణలో జరుగుతున్న అప్రజాస్వామిక పరిణామాలపై మాట్లాడే నైతిక హక్కు లేదని కేటీఆర్ స్పష్టం చేశారు.

మిగతా 2లో..

# తెలంగాణకు భారీ వర్ష సూచన

- మార్చి 15 నుంచి కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ
- పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ



# 'రాహుల్ దేశంలోనే అతిపెద్ద జోకర్'

**మొదటిపేజీ తరువాయి**

ఒక పార్టీ గుర్తుపై గెలిచిన వ్యక్తి, మరో పార్టీ గుర్తుపై ఎన్నికల్లో పోటీ చేసినా అనర్హుడిగా ప్రకటించకపోవడం అత్యంత విస్మయానికి గురిచేస్తోందన్నారు. స్పీకర్ తీర్పు కేవలం ఒక వ్యక్తికి ఇచ్చిన క్లీన్ చిట్ కాదని, అది భారత రాజ్యాంగంపై జరిగిన దాడిగా ఆయన అభివర్ణించారు. రాహుల్ గాంధీ నీతులు చెప్పడం మానేసి, ఈ అనైతిక చేష్టలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ స్వతంత్రంగా ఈ నిర్ణయం తీసుకున్నారని తాను భావించడం లేదని, దీని వెనుక కాంగ్రెస్ అధిష్టానం భారీ వ్యూహం ఉందని కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రం నుంచి ఢిల్లీకి చేరుతున్న భారీ ఆర్థిక వనరుల కోసమే రాహుల్ గాంధీ ఇలాంటి ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. సంచుల కట్టల కోసం రాహుల్ గాంధీ తన సిద్ధాంతాలను, విలువలను పక్కన పెట్టేశారని ఎద్దేవా చేశారు. పార్టీ ఫిరాయించిన వెంటనే సభ్యత్వం రద్దు కావాలని గతంలో మాట్లాడిన రాహుల్, ఇప్పుడు అదే ఫిరాయింపుదారులకు క్లీన్ చిట్ ఇప్పిస్తుంటే ఆయనను ఏమనాలని ప్రశ్నించారు. ఈ మొత్తం వ్యవహారంలో రాహుల్ గాంధీని 'దేశంలోనే అతిపెద్ద జోకర్'గా కేటీఆర్ అభివర్ణించారు. ఒకవైపు రాజ్యాంగం చేతపట్టుకుని దేశమంతా తిరుగుతూ ప్రజాస్వామ్యాన్ని రక్షిస్తానని ప్రగల్భాలు పలుకుతూ, మరోవైపు తన పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రంలో రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కుతున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీకి కొంచెమైనా సిగ్గు, గౌరవం ఉంటే తెలంగాణలో జరుగుతున్న ఈ అరాచకానికి బాధ్యత వహించాలని సవాల్ విసిరారు. చెప్పేవి శ్రీరంగ నీతులు, చేసేవి అరాచక పనులు అన్న చందంగా రాహుల్ తీరు ఉందని మండిపడ్డారు.



స్పీకర్ తీసుకున్న ఈ నిర్ణయం అత్యంత దుర్మార్గమైనదని, ఇది భవిష్యత్తులో ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల ప్రజలకు ఉన్న నమ్మకాన్ని సడలిస్తుందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఫిరాయింపుల గురించి కాంగ్రెస్ నేతలు చేసిన విమర్శలను గుర్తు చేస్తూ, ఇప్పుడు వారే అదే బాటలో నడవడం వారి ద్వంద్వ నీతికి నిదర్శనమన్నారు. దానం నాగేందర్ ఏకంగా కాంగ్రెస్ బీఫారంపై ఎంపీగా పోటీ చేసిన ఆధారాలు కళ్లముందే ఉన్నా, స్పీకర్ వాటిని పట్టించుకోకపోవడం వెనుక రాహుల్ గాంధీ నేరపూరిత ఆలోచనలే ఉన్నాయని ఆయన ఆరోపించారు.

రాజ్యాంగాన్ని కాపాడతామని ఓట్లు అడిగే కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి రాగానే అదే రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తోందని కేటీఆర్ ధ్వజమెత్తారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం యొక్క స్ఫూర్తిని తెలంగాణలో పూర్తిగా చంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ఆడిస్తున్న ఈ రాజకీయ నాటకంలో స్పీకర్ ఒక పాత్రధారిగా మారడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంపై జరుగుతున్న ఈ దాడిని తాము చూస్తూ ఊరుకోబోమని, న్యాయపరంగానూ, ప్రజల తరపున కూడా దీనిపై గట్టి పోరాటం చేస్తామని కేటీఆర్ హెచ్చరించారు.

ఎమ్మెల్యేగా ఒక పార్టీలో ఉంటూ, మరో పార్టీ తరపున ఎంపీగా పోటీ చేయడం కంటే పెద్ద ఫిరాయింపు సాక్ష్యం ఇంకేమి కావాలని కేటీఆర్ ప్రశ్నించారు. సామాన్యులకు కూడా అర్థమయ్యే ఈ లాజిక్ స్పీకర్‌కు ఎందుకు అర్థం కాలేదో ప్రజలందరికీ తెలుసన్నారు. రాహుల్ గాంధీ నుంచి వచ్చిన స్పష్టమైన ఆదేశాల మేరకే ఈ ప్రక్రియ జరిగిందని, ఇది నేరుగా రాహుల్ పర్యవేక్షణలో జరిగిన నేరమని ఆయన అభివర్ణించారు. కాంగ్రెస్ పార్టీకి నైతికత అనేది నిఘంటువులోనే లేదని, కేవలం అధికారం, డబ్బు కోసం ఎంతకైనా దిగజారుతారని విమర్శలు గుప్పించారు.

తెలంగాణ సమాజం ఈ పరిణామాలను గమనిస్తోందని, ప్రజల తీర్పును అపహాస్యం చేసిన ఏ రాజకీయ పార్టీకి భవిష్యత్తు ఉండదని కేటీఆర్ హెచ్చరించారు. రాహుల్ గాంధీ తన ఇమేజ్ పెంచుకోవడానికి రాజ్యాంగాన్ని వాడుకుంటున్నారు తప్ప, ఆయనకు రాజ్యాంగ విలువలపై ఇసుమంతైనా గౌరవం లేదని స్పష్టం చేశారు. ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ ప్రజాస్వామ్యాన్ని అంగడి సరుకుగా మార్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ ఈ వ్యవహారంలో ఒక 'నైతిక దోషి'గా చరిత్రలో నిలిచిపోతారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

తెలంగాణలో ఎమ్మెల్యేల కొనుగోలు, ఫిరాయింపుల వెనుక ఉన్న అసలు కుట్రదారులను ప్రజల ముందు ఉంచుతామని కేటీఆర్ తెలిపారు. రాజ్యాంగ రక్షకుడినని చెప్పుకుంటూ ఇలాంటి అనైతిక కార్యక్రమాలకు పచ్చజెండా ఊపుతున్న రాహుల్ గాంధీకి కాలమే బుద్ధి చెబుతుందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను అపహాస్యం చేస్తూ, పార్టీ ఫిరాయింపుదారులకు కొమ్ముకాస్తున్న స్పీకర్ నిర్ణయం చెత్తబుట్టలోకి చేరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు ఈ 'అనైతిక పాలన'ను, 'సంచుల రాజకీయాన్ని' ఎన్నటికీ క్షమించరని ఆయన స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ తన వైఖరిని మార్చుకోకపోతే దేశంలో ఆయనకు రాజకీయ భవిష్యత్తు ఉండదని కేటీఆర్ హెచ్చరించారు. నీతులు చెప్పే నోరు, అక్రమాలకు సహకరించే చేయి ఒక్కరిదే కావడం రాహుల్ మార్క్ రాజకీయమని ఎద్దేవా చేశారు. దానం నాగేందర్ వ్యవహారంలో స్పీకర్ ఇచ్చిన క్లీన్ చిట్ కేవలం తాత్కాలికమేనని, ప్రజల కోర్టులో కాంగ్రెస్ పార్టీకి, రాహుల్ గాంధీకి శిక్ష తప్పదని కేటీఆర్ ఉద్ఘాటించారు. ఈ అప్రజాస్వామిక పోకడలపై తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడే వరకు వెనక్కి తగ్గేది లేదని ఆయన పునరుద్ఘాటించారు.

## తెలంగాణ, ఏపీ మధ్య గ్రీన్ ఫీల్డ్ హైవే

**ప్రభాత జాగృతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య రవాణా వ్యవస్థను అనుసంధానించే క్రమంలోనే గ్రీన్ ఫీల్డ్ హైవేను నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఈ హైవే ఖమ్మం నుంచి దేవరపల్లి వరకు నిర్మిస్తున్నారు. అయితే సంక్రాంతి సమయంలో వామనాల రద్దీని దృష్టిలో ఉంచుకొని అధికారులు ఈ హైవేపై తాత్కాలికంగా వాహనాలను అనుమతించారు. కొన్ని కారణాల వల్ల దీనిని మూసి వేయాల్సి వచ్చింది. అయితే ఈ హైవే పూర్తిగా వాహనదారులకు జూన్ నెలలో అందుబాటులలోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. దీనిని సుమారు రూ.4,451.87 కోట్ల వ్యయంతో, 162.4 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న ఈ హైటెక్ రహదారి పనులు ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయి. భారత్ మాల పరియోజన పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు, ఈ ఏడాది జూన్ నాటికి ప్రారంభం కానుంది. హైదరాబాద్ నుండి విశాఖపట్నం వెళ్లే వారికి దూరం 80 కిలోమీటర్లు తగ్గడమే కాకుండా.. ప్రయాణం ఎంతో వేగవంతం అవుతుంది. ఏఐ (AI) నిఘా కెమెరాలు, సోలార్ లైటింగ్, 10 ప్రధాన వంతెనలు, 98 అండర్ పాసులతో ఈ రహదారిని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం నాలుగు లైన్లుగా ఉన్న ఈ యాక్సెస్ కంట్రోల్ రహదారిని.. భవిష్యత్తులో ఆరు లైన్లకు పెంచుకునేలా డిజైన్ చేశారు. ఈ కారిడార్ వల్ల ఖమ్మం జిల్లాలో లాజిస్టిక్ హబ్‌లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పడి స్థానిక రైతులకు, వ్యాపారులకు మేలు చేకూరనుంది. అత్యాధునిక సదుపాయాలతో సిద్ధమవుతున్న ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే రెండు రాష్ట్రాల మధ్య వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేయనుంది.



# ఇరాన్ టెక్ వార్

**మొదటిపేజీ తరువాయి**

పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. దక్షిణ టెల్ అవీవ్‌లోని హేలా శాటిలైట్ కమ్యూనికేషన్ సెంటర్‌పై రెండోసారి దాడి జరగడం చూస్తుంటే, ఇజ్రాయెల్ కమ్యూనికేషన్ వ్యవస్థను నిర్వీర్యం చేయడమే ఇరాన్ వ్యూహంగా కనిపిస్తోంది. బీర్ యాకూబ్, పశ్చిమ జెరూసలేం, హైఫాలోని సైనిక జోన్లు ఇరాన్ ప్రధాన లక్ష్యాలుగా మారాయి. ఇరాన్ దూకుడు ఇంతటితో ఆగడం లేదు. పశ్చిమాసియాలోని గల్ఫ్ దేశాల్లో ఉన్న బ్యాంకులు, ఆర్థిక సంస్థలను కూడా లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించింది. ఇజ్రాయెల్‌కు సహకరించే దేశాల ఆర్థిక వెన్నుముకను దెబ్బతీయడం ద్వారా శత్రువును లొంగదీసుకోవాలని ఇరాన్ యోచిస్తోంది. ఇజ్రాయెల్ తనపై చేస్తున్న దాడుల్లో గూగుల్, ఎన్‌వీడియా వంటి సంస్థల కృత్రిమ మేధస్సు, క్లౌడ్ టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తున్నాయని ఇరాన్ బలంగా నమ్ముతోంది. అందుకే ఈ సంస్థల కార్యాలయాలపై దాడులకు సైతం వెనుకాడబోమని ఐఆర్‌జీసీ అనుబంధ సంస్థ 'తస్నిమ్' స్పష్టం చేసింది. ఇది అంతర్జాతీయ వాణిజ్య, సాంకేతిక రంగాలపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. యుద్ధ నీతిని పక్కనపెట్టి ఇరాన్ క్లస్టర్ బాంబులను ప్రయోగిస్తోందని ఇజ్రాయెల్ ఆరోపించడం ఇప్పుడు అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. మంగళవారం నాటి దాడుల్లో సుమారు 300 బాలిస్టిక్ క్షిపణులను ఇరాన్ వాడగా, వాటిలో సగానికి పైగా క్లస్టర్ బాంబు వార్‌హెడ్లను కలిగి ఉన్నాయని సమాచారం. 2008 క్లస్టర్ మునిషన్స్ కన్వెన్షన్ ప్రకారం వీటి వినియోగంపై ప్రపంచవ్యాప్తంగా నిషేధం ఉన్నప్పటికీ, ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా వంటి దేశాలు ఆ ఒప్పందంపై సంతకాలు చేయలేదు. ఈ వెసులుబాటును వాడుకుని ఇరాన్ జనావాసాలపై విచక్షణారహితంగా దాడులు చేస్తోందని, దీనివల్ల ఇప్పటివరకు 12 మంది ఇజ్రాయెలీలు ప్రాణాలు కోల్పోగా, 2 వేల మందికి పైగా గాయపడ్డారని ఆరోగ్యశాఖ వెల్లడించింది.

యుద్ధం కేవలం ఇజ్రాయెల్‌ఇరాన్ మధ్యే పరిమితం కాకుండా పొరుగున ఉన్న గల్ఫ్ దేశాలకు కూడా పాకింది. ప్రపంచ చమురు అవసరాలను తీర్చే సౌదీ అరేబియాలోని షేబా చమురు క్షేత్రంపై ఇరాన్ డ్రోన్ దాడులకు తెగబడింది. రోజుకు 10 లక్షల బారెళ్ల చమురు ఉత్పత్తి చేసే ఈ క్షేత్రంపై దాడులు జరిగితే ప్రపంచ ఇంధన ధరలు ఆకాశాన్నంటడం ఖాయం. అదృష్టవశాత్తూ సౌదీ రక్షణ దళాలు ఐదు డ్రోన్లను కూల్చివేయడంతో పెను ప్రమాదం తప్పింది. కువైట్‌లోని అమెరికా సైనిక ప్రధాన కార్యాలయంపై కూడా క్షిపణి దాడులు జరిగాయి. అక్కడ కువైట్ నేషనల్ గార్డ్ అప్రమత్తమై డ్రోన్లను కూల్చివేసింది. ఈ దాడులతో గల్ఫ్ రీజియన్‌లో రవాణా, వ్యాపార లావాదేవీలు గందరగోళంలో పడ్డాయి. దుబాయ్ విమానాశ్రయం వంటి అత్యంత రద్దీగా ఉండే ప్రదేశాల సమీపంలో కూడా డ్రోన్లు పడిపోవడం ప్రయాణికులను బెంబేలెత్తిస్తోంది. విమాన రాకపోకలకు ఆటంకం కలగలేదని అధికారులు చెబుతున్నప్పటికీ, నలుగురు వ్యక్తులు గాయపడటం భద్రతా వైఫల్యాలను ఎత్తిచూపుతోంది. యూఏఈ తీరంలోని రస్ అల్‌ఖైమా వద్ద ఒక కంటైనర్ నౌక క్షిపణి దాడికి గురికావడం సముద్ర మార్గాల్లో రవాణా భద్రతను ప్రశ్నిస్తోంది. బహ్రెయిన్ అంతటా సైరన్లు మోగడం, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ప్రభుత్వం ఆదేశించడం చూస్తుంటే యుద్ధం ముంగిట దేశాలన్నీ ఎంతటి ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయో అర్థమవుతుంది. మనామాలోని అమెరికా నౌకాదళ స్థావరం కూడా ఇప్పుడు ఇరాన్ డ్రోన్ల నిఘా నీడలో ఉంది. ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లో కూడా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అర్బిల్ విమానాశ్రయం సమీపంలోని అమెరికా సైనిక కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకున్న డ్రోన్ దారి తప్పి ఒక నివాస గృహంపై పడటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గగనతలంలో జరుగుతున్న ఈ క్షిపణి పోరు సామాన్య ప్రజల ప్రాణాలను హరిస్తోంది. ఇటు ఖతార్ సైతం తమ వైపు వచ్చిన క్షిపణులను అడ్డుకున్నామని ప్రకటించింది. దేశంలో భద్రతా ముప్పు పొంచి ఉన్నందున ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని హెచ్చరించింది. ఏ క్షణంలో ఎటు నుంచి క్షిపణి దూసుకొస్తుందో తెలియని స్థితిలో గల్ఫ్ ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నారు. హోర్ముజ్ జలసంధిని మూసివేస్తామన్న ఇరాన్ హెచ్చరికలపై అంతర్జాతీయంగా తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ప్రపంచ ఇంధన సరఫరాలో అత్యంత కీలకమైన ఈ మార్గాన్ని అడ్డుకోవడం అంటే ప్రపంచ ఆర్థిక వ్యవస్థను స్తంభింపజేయడమేనని ఖతార్ మంత్రి మొహమ్మద్ బిన్ అబ్దులజీజ్ అల్‌ఖులైఫీ విమర్శించారు.

# ఇండియా ఫస్ట్ మా నినాదం

**మొదటిపేజీ తరువాయి**



తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వంపై కూడా ప్రధాని ఈ సందర్భంగా ఘాటు విమర్శలు చేశారు. 2021లో ప్రజలు డీఎంకేకు అధికారం ఇస్తే, ఆ పార్టీ తన బాధ్యతను మరచి ప్రజాతీర్పును వంచించిందని మండిపడ్డారు. డీఎంకేలో అధికారం మొత్తం ఒకే కుటుంబం చుట్టూ తిరుగుతున్నదని, 'సైంటిఫిక్ కరప్షన్ మోడల్' ద్వారా తమిళనాడును ఆ కుటుంబానికి ఏటీఎంలా మార్చేశారని ఆయన ఆరోపించారు. కేవలం ఒకే కుటుంబం ప్రయోజనాల కోసం కాకుండా, ప్రతి కుటుంబం కోసం పనిచేసే ప్రభుత్వం తమిళనాడుకు అవసరమని ఆయన పేర్కొన్నారు. ఈ జిల్లాకు చెందిన ఒక మంత్రి భారీ నగదుకోసంఉద్యోగం స్కామ్‌లో చిక్కుకున్న విషయాన్ని ఆయన గుర్తుచేస్తూ, అవినీతి సొమ్మంతా సముద్రంలోకి నదులు వెళ్లినట్లుగా ఒకే కుటుంబం వద్దకు చేరుతున్నదని విమర్శించారు. వికసిత భారత నిర్మాణంలో తమిళనాడు పాత్ర కీలకం అంతకుముందు, తిరుచిరాపల్లిలో సుమారు రూ. 5,650 కోట్ల విలువైన పలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రారంభించారు. వికసిత భారత నిర్మాణంలో వికసిత తమిళనాడు పాత్ర కీలకమని, అందుకే పెట్రోలియం, రహదారులు , రైల్వే రంగాల్లో భారీగా పెట్టుబడులు పెడుతున్నామని ఆయన వివరించారు. ముఖ్యంగా దక్షిణ తమిళనాడు అభివృద్ధికి మదురై విమానాశ్రయం అంతర్జాతీయ హోదా ఎంతో దోహదపడుతుందని చెప్పారు. గల్ఫ్ దేశాలలో పనిచేస్తున్న లక్షలాదిమంది భారతీయుల భద్రత పట్ల తమ ప్రభుత్వం అత్యంత శ్రద్ధ వహిస్తోందని, ఏ కష్టకాలంలోనైనా విదేశాల్లో ఉన్న భారతీయులను సురక్షితంగా రక్షించుకున్న చరిత్ర తమదని ప్రధాని పునరుద్ఘాటించారు.

**తమిళనాడు ఆర్థికవ్యవస్థకు కొత్త ఊపిరి ఈ ప్రాజెక్టులు**

ప్రధాని ప్రారంభించిన ప్రాజెక్టులలో రూ. 3,680 కోట్లతో నీలగిరి, ఈరోడ్ జిల్లాల్లో బీపీసీఎల్చేపట్టనున్న సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ అత్యంత ప్రధానమైనది. దీనిద్వారా సుమారు 9 లక్షల కుటుంబాలకు పైపుల ద్వారా నేరుగా వంటగ్యాస్ అందనుంది. అదేవిధంగా, చెన్నై మనాలిలో రూ. 1,490 కోట్లతో నిర్మించిన అత్యాధునిక ల్యూబ్ ప్లాంట్‌ను ఆయన దేశానికి అంకితం చేశారు. గ్రామీణ రవాణాను బలోపేతం చేస్తూ 370 కిలోమీటర్ల పొడవైన 89 రోడ్లను ప్రారంభించడంతో పాటు, రాజేంద్ర చోళుడి చారిత్రక వారసత్వాన్ని కాపాడేలా గంగైకొండ చోళపురం వద్ద గ్రీన్‌ఫీల్డ్ బైపాస్ నిర్మాణానికి పునాది వేశారు. రైల్వే విభాగంలో ఐదు కొత్త రైళ్లను (రెండు అమృత్ భారత్ సహా) జెండా ఊపి ప్రారంభించి, తమిళనాడును ఇతర దక్షిణాది రాష్ట్రాలు , తూర్పు భారత్‌తో అనుసంధానం చేశారు. ఈ ప్రాజెక్టులు తమిళనాడు ఆర్థికవ్యవస్థకు కొత్త ఊపిరి పోస్తాయని ప్రధాని మోడీ పునరుద్ఘాటించారు.

# రైతు భరోసాపై కీలక ప్రకటన

**ప్రభాత జాగృతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ రాష్ట్రంలో రైతు భరోసా కోసం ఎదురు చూస్తున్న రైతులకు శుభవార్త .మార్చి నెల నుంచే రైతు భరోసా నిధులను జమ చేయనున్నట్లు రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రకటించారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొంటూ.. మొత్తం 9 వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు మంత్రి వివరించారు. దీనిని రెండు విడతల్లో పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. మార్చి నెలాఖరులోగా రూ. 4,500 కోట్లు.. మిగిలిన నిధులను ఏప్రిల్ నెలలో జమ చేస్తామన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని.. సన్న వడ్లు పండించే 90 శాతం రైతులకు ప్రభుత్వం బోనస్ అందిస్తోందని తెలిపారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఐకేపీ, డీసీఎంఎస్ కేంద్రాలను పర్యవేక్షించాల్సిన బాధ్యత మార్కెట్ కమిటీలపై ఉందన్నారు. గత ప్రభుత్వ తీరును విమర్శిస్తూ.. కమీషన్ల కోసమే ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టును పక్కనపెట్టి కాళేశ్వరాన్ని తెరపైకి తెచ్చారని మంత్రి మండిపడ్డారు. కాళేశ్వరం బ్యాక్ వాటర్ వల్ల స్థానిక రైతులు పంట నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కాకా వెంకటస్వామి హయాంలోనే ప్రాణహిత ప్రాజెక్టు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 11 వేల కోట్లు ఖర్చు చేసిందని ఆయన గుర్తు చేశారు. చెన్నూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మహేశ్ ప్రసాద్ తివారీ, వైస్ చైర్మన్‌గా పాపిరెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కార్యవర్గం రైతుల ప్రయోజనాల కోసం అంకితభావంతో పనిచేయాలని మంత్రి సూచించారు.





## పెట్రోల్, గ్యాస్ కొరతపై రాష్ట్రాలకు
# కేంద్రం కీలక ఆదేశం

**ప్రభాత జాగృతి, స్టేట్ బ్యూరో:** మధ్య ప్రాచ్యంలో నెలకొన్న తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఇంధన కొరత ఏర్పడవచ్చనే వార్తలపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. పెట్రోల్, డీజిల్ , ముడిచమురు సరఫరా విషయంలో ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేస్తూ, కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. దేశవ్యాప్తంగా ఇంధన సరఫరా సజావుగా సాగేలా చూడాలని కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలు , కేంద్రపాలిత ప్రాంతాలకు దిశానిర్దేశం చేసింది. కేంద్ర హోం సెక్రటరీ నేతృత్వంలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో, ఇంధన అక్రమ నిల్వలు (Hoarding) , నల్లబజారును అరికట్టేందుకు కఠినమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర డీజీపీలు, చీఫ్ సెక్రటరీలను కోరారు. గ్లోబల్ షిప్పింగ్ మార్గాల్లో ఆటంకాలు ఉన్నప్పటికీ, భారత్‌కు ముడిచమురు దిగుమతులు నిరంతరాయంగా అందుతున్నాయని కేంద్ర పెట్రోలియం శాఖ జాయింట్ సెక్రటరీ సుజాతా శర్మ భరోసా ఇచ్చారు. ప్రస్తుతం భారత్ దిగుమతి చేసుకునే చమురులో 70 శాతం ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వస్తోందని, అదనపు కార్గో షిప్‌లు కూడా మార్గమధ్యంలో ఉన్నాయని ఆమె వివరించారు. పుకార్ల కారణంగా ప్రజలు ఇంధనాన్ని భారీగా నిల్వ చేసుకునే అవకాశం ఉందని, దీనివల్ల కృత్రిమ కొరత ఏర్పడే ప్రమాదం ఉందని కేంద్రం హెచ్చరించింది. ఇలాంటి పరిస్థితులను అరికట్టడానికి ప్రతి రాష్ట్రం ఒక అధికారిక ప్రతినిధిని నియమించి, ఎప్పటికప్పుడు ప్రజలకు వాస్తవాలను వివరించాలని సూచించింది. మీడియా సంస్థలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించి, తప్పుడు సమాచారం వ్యాప్తి చెందకుండా చూడాలని కోరింది. మధ్య ప్రాచ్యంలో యుద్ధ వాతావరణం వల్ల విమాన రాకపోకలపై ప్రభావం ఉన్నప్పటికీ, దేశీయంగా ఇంధన అవసరాలకు ఎలాంటి ఇబ్బంది లేదని, కాబట్టి వినియోగదారులు అనవసరంగా భయపడాల్సిన అవసరం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## ఫిరాయింపులకు పాత్రధారి,
# సూత్రధారి కేసీఆరే

**మొదటిపేజీ తరువాయి**

అసలు అనర్హత పిటిషన్‌కే అర్హత లేదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ నియమావళి ప్రకారం పార్టీ ఫిరాయింపుకు పాల్పడిన సభ్యునికి ముందుగా షోకాజ్ నోటీసు ఇచ్చి వివరణ కోరాలని, అయితే తనకు ఎలాంటి షోకాజ్ నోటీసు ఇవ్వలేదని, వివరణ కూడా తీసుకోలేదని వెల్లడించారు. పార్టీ విప్‌ను కూడా తాను ఎప్పుడూ ధిక్కరించలేదని అన్నారు. కేసీఆర్ ఇప్పటి వరకు పార్టీ ఫిరాయింపులపై మాట్లాడలేదని, పార్టీ పరంగా ఎందుకు పిటిషన్ వేయలేదని ప్రశ్నించారు. శాసనసభ సమావేశాల్లో కేటీఆర్ తమ సభ్యుల సంఖ్య 38గా ఉందని పేర్కొంటూ, అందుకు తగిన విధంగా సమయం ఇవ్వాలని స్పీకర్‌ను కోరిన విషయాన్ని గుర్తు చేశారు. ఒకవైపు తమపై అనర్హత వేటు వేయాలని పిటిషన్ వేస్తూ, మరోవైపు బీఆర్ఎస్ ఎల్పీకి నెలకు రూ.5 వేల చొప్పున తమ జీతాల నుంచి సభ్యత్వ రుసుము వసూలు చేస్తున్నారని విమర్శించారు.

**పార్టీ మారిన ఇద్దరిని మంత్రులను చేయలేదా?**

2014 నుంచి 2023 వరకు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇతర పార్టీల నుంచి ఎంతమంది ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. అసలు పార్టీ ఫిరాయింపులకు పాత్రధారులు, సూత్రధారులు బీఆర్ఎస్ నాయకత్వమేనని ఆరోపించారు. 36 మంది ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకోవడమే కాకుండా, పార్టీ మారిన ఇద్దరు ఎమ్మెల్యేలను మంత్రులుగా చేసిన చరిత్ర బీఆర్ఎస్‌దేనని విమర్శించారు. తెలంగాణలో ఇతర రాజకీయ పార్టీలకు స్థానం లేకుండా చేయాలనే ఉద్దేశంతో శాసనసభా పక్షాలను కూడా పార్టీలో విలీనం చేసుకున్నారని ఆయన ఆరోపించారు. అయినప్పటికీ కేటీఆర్ సుద్దపూస లెక్క మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. తాను చేసినది తప్పని భావిస్తే కేసీఆర్ తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని, అలా చెప్పిన వెంటనే తాను రాజీనామా చేస్తానని పునరుద్ఘటించారు. లేదంటే తమ రాజీనామాల గురించి మాట్లాడే అర్హత ఆయనకు లేదని కడియం శ్రీహరి తేల్చిచెప్పారు.



# కవిత, విశారదన్ పోరాటంతో దిగివచ్చిన ప్రభుత్వం





- **వెలుగుమట్ల బాధితుల న్యాయం చేస్తామన్నా మంత్రులు**
- **ఆమరణ దీక్షకు విరామం, నిమ్మరసం అందించిన జస్టిస్ ఈశ్వరయ్య**

**హైదరాబాద్,మార్చ్ 11(ప్రభాత జాగృతి):** ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో పేదల ఇళ్ల కూల్చివేతకు వ్యతిరేకంగా చేపట్టిన పోరాటం ఫలించింది.ప్రభుత్వం దిగివచ్చి బాధితులకు ఇళ్లు, పట్టాలు పంపిణీ చేస్తామని ప్రకటించడంతో జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, విశారదన్ మహారాజ్ తమ నిరాహార దీక్షను విరమించారు. జస్టిస్ ఈశ్వరయ్య వారికి నిమ్మరసం అందించి దీక్షకు విరామం ఇవ్వలని కోరారు.ప్రభుత్వ తీరుపై కవిత ధ్వజమెత్తారు. అర్ధరాత్రి కూల్చి వేతలు అమానుషమని మండి పడ్డారు. ప్రైవేట్ ప్రాపర్టీలోకి వచ్చి, అర్ధరాత్రి పూట బుల్డోజర్లతో పేదల ఇళ్లను కూల్చేయడానికి ప్రభుత్వానికి ఎంత ధైర్యమని ప్రశ్నించారు. ఇది ప్రజాస్వామ్యమా? లేక అఫ్ఘనిస్తాన్ లో ఉన్నామా అని నిలదీశారు.

**రాహుల్ గాంధీకి కవిత సూటి ప్రశ్న**

చేతిలో రాజ్యాంగం పట్టుకుని తిరిగే రాహుల్ గాంధీ, తెలంగాణ లో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అక్రమాలను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులకు ప్రభుత్వం బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేదంటే రాజ్యాంగం పట్టుకోవడం వృథా అని సవాల్ విసిరారు.

**భూదాన్ భూముల పై కుట్ర**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1.74 లక్షల ఎకరాల భూదాన్ భూములపై ప్రభుత్వ పెద్దల కన్ను పడిందని కవిత తెలిపారు. వెలుగుమట్ల సంఘటన కేవలం ఒక ట్రయల్ మాత్రమేనన్నారు. భూదాన్ భూములపై ప్రభుత్వం తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**అధికారులపై చర్యలు**

ల్యాండ్ ఓనర్ల ఇళ్లను ఖాళీ చేయించామని స్వయంగా పోలీస్ కమిషనరే ట్వీట్ చేశారని, పేదల ఇళ్లు కూల్చిన అధికారులపై కేసులు నమోదు చేయాలని కోరారు. అలాగే కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలన్నారు.

**పోరాటం ముగియలేదు-కవిత**

పేదలకోసం తాము పోరాటం చేస్తామని కవిత స్పష్టం చేశారు.ఇక ప్రభుత్వం ప్రకటించిన టోకెన్లపై తమకు అనుమానం ఉందని, ప్రతి కుటుంబానికి లేఅవుట్ తీసి ఫిజికల్ ప్రాపర్టీని చూపించే వరకు విశ్రమించబోమని కవిత స్పష్టం చేశారు. బాధితులకు జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి జస్టిస్ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ వేస్తామని, సంపూర్ణ న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# రేణుక ఎల్లమ్మ తల్లి సిద్ధంలో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్



**వేములవాడ ,మార్చ్ 11(ప్రభాత జాగృతి):** వేములవాడ పట్టణ పరిధిలోని నాంపల్లిలో గౌడ సంఘం వారి ఆధ్వర్యంలో జరుగుతున్న ఎల్లమ్మ తల్లి సిద్ధోగంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు అమ్మ వారికీ బోనాలు సమర్పించారు సందర్భంగా అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సన సంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ మున్సిపల్ చైర్మన్ పుల్కమ్ రాజు వైస్ నరాల శేఖర్ రంగు వెంకటేష్ నాంపెల్లి గౌడసంఘము అధ్యక్షలు సత్తయ్య పోత్తూరి శ్రీనివాస్ గౌడ్ శిలివేరితిరుపతి తదితురులు పాల్గొన్నారు

# రామా మందిర నిర్మాణానికి 1 లక్ష రూపాయలు విరాళం



**తాండూర్,మార్చ్ 11(ప్రభాత జాగృతి):** తాండూరు పట్టణంలోని ఇంద్ర నగర్ లో గల ఏకైక రామ మందిరం పునర్నిర్మాణంలో భాగంగా. ఈనెల 23వ తేదీ నుండి 25వ తేదీ వరకు పున ప్రతిష్టపన కార్యక్రమం. అలాగే 27వ తేదీన శ్రీరామనవమి పురస్కరించుకొని ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి కీ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి స్పందిస్తూ ఆలయ పునర్నిర్మాణ ప్రతిష్టాపన కార్యక్రమానికి హాజరవుతానని తెలిపారు. అదేవిధంగా పునర్నిర్మాణంలో భాగంగా ఒక లక్ష రూపాయలను తనవంతు విరాళాన్ని ప్రకటించారు. ఈనెల 23 నుండి 27వ తేదీ వరకు ఆలయ పునర్నిర్మాణ ప్రతిష్టాపన తో పాటు 27వ తేది శ్రీరామనవమి కార్యక్రమం అంగరంగ వైభవంగా జరుగుతోందని. ఐదు రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో రాజకీయ నాయకులు ప్రముఖులు వ్యాపారవేత్తలు ప్రజలు భక్తులు ప్రతి ఒక్కరూ భారీ ఎత్తున పాల్గొని తమ వంతు సహాయ సహకారాలను అందించి శ్రీరామచంద్రుని ఆశీస్సులు పొందగలరని ఆలయ కమిటీ సభ్యులు కోరారు...

# వెలుగుమట్ల బాధితులందరికి న్యాయం జరగాల్సిందే



**ఎంపీ వద్ది రాజు రవిచంద్ర**

**సిటీ బ్యూరో,మార్చ్ 11(ప్రభాత జాగృతి):** వెలుగుమట్ల బాధితులందరికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర స్పష్టం చేశారు.ఖమ్మం నగర శివార్లలోని 60 ఎకరాల భూదాన్ భూముల్లో 700 కుటుంబాలు గుడిసెలు వేసుకుని జీవిస్తుండగా, అందులో కేవలం 311 మందికి మాత్రమే పట్టాలివ్వడం అభ్యంతరకరమన్నారు. ప్రభుత్వం అనాలోచిత చర్యతో రోడ్డునపడ్డ బాధితులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు పరామర్శించి మనోధైర్యాన్నిచ్చి కొండంత అండగా నిలిచారని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు.నిరాశ్రయులైన వారంతా కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన వారేనని, ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో బీఆర్ఎస్ ఆధ్వర్యాన తాగునీరు,భోజన వసతి కల్పించడం జరిగిందని ఎంపీ రవిచంద్ర వివరించారు.బాధితులకు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ అండగా నిలిచి పోరాడడంతో ప్రభుత్వం దిగివచ్చి పట్టాలిచ్చేందుకు ముందుకు వచ్చిందని ఆయన స్పష్టం చేశారు.కేవలం 311మందికి పట్టాలిచ్చి చేతులు దులుపుకుంటే సరిపోదని, నిరాశ్రయులైన 700 కుటుంబాలకు స్థలాలు ఇవ్వడమే కాక డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టించి ఇవ్వాలని ఎంపీ రవిచంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కూల్చివేతల సందర్భంగా పక్కా గృహాలు కోల్పోయిన వారికి తగువిధంగా నష్టపరిహారం చెల్లించాలని,వెలుగుమట్లలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎంపీ వద్దిరాజు కోరారు.

# దరఖాస్తుల ఆహ్వానం

**జగిత్యాల, మార్చి11(ప్రభాత జాగృతి):** తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్, జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించే 202526 విద్యాసంవత్సరానికి ఐదు(5) నెలల ఫౌండేషన్ కోర్సు(అన్ని రాష్ట్రస్థాయి పోటీ పరీక్షలకు) ఉచిత శిక్షణ అభ్యర్థులు (100) మందికి భోజనాలు ఏర్పాటు చేయుటకు క్యాటరింగ్ యాజమాన్యం నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తుందని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాజ్కుమార్ తెలిపారు. ప్రతి విద్యార్థికి రోజుకు రూ.105 చొప్పున గరిష్టంగా రోజుకు వంద మందికి అల్పాహారం, మధ్యాహ్నభోజనం, టీ స్నాక్స్, రాత్రి భోజనాలకు మెనూ ప్రకారం' ఐదు నెలలకు నిరంతరంగా ఏర్పాటు చేయాల్సి ఉంటుం దన్నారు. ఆసక్తిగల క్యాటరింగ్ యాజమాన్యం నుంచి ఈ నెల 14తేదీలోగా రూ.30వేల ఈఎండీ, డీఎస్సీడీవో జగిత్యాల పేరుమీద డీడీ తీసి, డైరెక్టర్ ఎస్సీ స్టడీ సర్కిల్, తులసీనగర్ జగిత్యాల య ందు సమర్పించాలని కోరారు. స్వశక్తి మహిళా సంఘాలకు ప్రాధాన్యత ఇవ్వబడునని, మరిన్ని వివరాలకు డైరెక్టర్ 9959264770 నెంబర్ కు సంప్రదించాలని కోరారు.

# విద్యార్థినికి జిల్లా విద్యాధికారి అభినందన



**జగిత్యాల , మార్చి11(ప్రభాత జాగృతి):** సైనిక్ స్కూల్ ప్రవేశపరీక్షలో రాష్ట్ర స్థాయిలో 23వ ర్యాంకు సాధించిన మానస స్కూల్ ఆఫ్ ఎక్సెలెన్స్ విద్యార్థిని ఆర్.శ్రేయాన్విని జిల్లా విద్యాధికారి రాము అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. చిన్నవయస్సులోనే రాష్ట్రస్థా లో ప్రతిభకనబర్చడం అభినందనీయం అన్నారు. విద్యార్థులను అన్నిరంగాల్లో ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంలో ప్రోత్సాహం, తోడ్పాట లను అందిస్తున్న పాఠశాల యాజమాన్యంకు, ఉపాధ్యాయులను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. శ్రేయాని సాధించిన విజయం తోటి విద్యార్థులకు స్ఫూర్తిదాయకం అన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలను సాధించి పాఠశాలకు, జిల్లాకు మరింత మ ంచిపేరును తీసుకురావాలని ఆశీస్సులు అందజేశారు. ప్రిన్సిపాల్ రజితరావు' మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులను ఐఐటీ, జేఈఈ, నీట్వంటి జాతీయస్థాయి పోటీ పరీక్షలకు సిద్ధంచేసే దిశగా ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామన్నారు. నాణ్యమైన విద్యతోపాటు పోటీ పరీక్షలకు బలమైన పునాది వేయడమే తమ పాఠశాల లక్ష్యమని రజితరావు తెలిపారు. వీరితో పాటు పాఠశాల డైరెక్టర్లు శ్రీధర్రావు, హరిచరణరావు, మౌనికరావుతో పాటు ఉపాధ్యాయులు శ్రేయాన్వికి శుభాకాంక్షలు తెలుపుతూ అభినందించారు.

# ఈనెల 14 నుంచి 10వ తరగతి పరీక్షలు!

**హైదరాబాద్,మార్చ్ 11(ప్రభాత జాగృతి)::** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తం గా మార్చి 14 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి, ఈ పరీక్షలు ఏప్రిల్ 16వ తేదీ వరకు కొనసాగనున్నాయి. విద్యార్థులు ముమ్మరంగా ప్రిపరేషన్ సాగిస్తున్నారు. మరోవైపు ఇప్పటికే విద్యార్థుల హాల్ టికెట్లు కూడా విడదలయ్యాయి. మీ సేవ కేంద్రాల ద్వారా కూడా డౌన్లోడ్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. 8096958096 వాట్సాప్ నంబరు ద్వారా కూడా హాల్టికెట్లు పొందొచ్చు. విద్యార్థులు భయపడ కుండా ఆత్మవిశ్వాసంతో రాయాలని విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా విద్యార్థులకు సూచించా రు. ఈ సారి రాష్ట్ర వ్యాప్తం గా మొత్తంగా 5,28,239 మంది పరీక్షలకు హాజరవు తున్నారు. వీరిలో రెగ్యుల ర్ విద్యార్థులు 5,17,727 మంది ఉన్నారు. 5,329 ప్రభుత్వ పాఠశాలల నుంచి 2,07,573 మంది, 1,057 గురుకులాల నుంచి 60, 139 మంది, 5,288 ప్రైవే ట్, ఎయిడెడ్ పాఠశాలల నుంచి 2,50,015 మంది పరీక్షలు రాయనున్నారు. ఆయా తేదీల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు సులువుగా చేరుకునేం దుకు హాల్టికెట్లపై క్యూఆర్ కోడ్ను కూడా ముద్రించారు. మొబైల్ ఫోన్ ద్వారా దీనిని స్కాన్ చేస్తే రూట్ మ్యాప్ ఆటోమెటిక్గా ఓపెన్ అవుతుంది. పదో తరగతి పరీక్షలు జీవితంలో ఒకసారి మాత్రమే జరుగుతాయి. అందువల్ల విద్యార్థులు పాఠ్యాంశాలు చదివి వాటిని రాయడం ద్వారా ఎక్కువ కాలం గుర్తుంటాయి. అప్పుడు పరీక్షలో సమాధానాలు చక్కగా గుర్తుపెట్టుకుని రాయడానికి అవకాశం ఉంటుందని పాఠశాల విద్య డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ తెలిపారు. సీ సీ కెమెరాల ముందే పరీక్ష పేపర్ ఓపెన్ చేసేలా ఏర్పాట్లు చేశారు.



# తెలంగాణలో మరో డిస్కం ఏర్పాటు

**మొదటిపేజీ తరువాయి**



పెట్టుకుని ఈ కొత్త సంస్థను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ కొత్త డిస్కమ్కు ఐఏఎస్ అధికారి ముషారఫ్ అలీ ఫరూఖీను ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్గా నియమించారు. విద్యుత్ రంగంలో ఆయనకు ఉన్న పరిపాలనా అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని కొత్త సంస్థ నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం ఆయనకు అప్పగించింది. 'రైతు డిస్కమ్' ప్రధానంగా వ్యవసాయ రంగానికి సంబంధించిన విద్యుత్ సరఫరాను చూసుకుంటుంది. వ్యవసాయ కనెక్షన్లు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు, మిషన్ భగీరథ వంటి తాగునీటి పథకాల కోసం అవసరమైన విద్యుత్ సరఫరాను ఈ సంస్థ నిర్వహించనుంది. అలాగే హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు అవసరాలకు కూడా విద్యుత్ అందించే బాధ్యత ఈ సంస్థపై ఉంటుంది. ఈ సంస్థ ద్వారా కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం, విద్యుత్ కొనుగోలు చేసి సరఫరా చేయడం, ట్రాన్స్ఫార్మర్లు , విద్యుత్ లైన్ల నిర్వహణ వంటి పనులు చేపడతారు. అదేవిధంగా విద్యుత్ వినియోగాన్ని లెక్కించడం, మీటర్ల నిర్వహణ చేయడం, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడం వంటి బాధ్యతలను కూడా ఈ సంస్థ నిర్వర్తిస్తుంది. కొత్త సంస్థ బోర్డు ఆఫ్ డైరెక్టర్లలో విద్యుత్ శాఖకు చెందిన పలువురు అధికారులు సభ్యులుగా ఉంటారు. వీరిలో తిరుపతి రెడ్డి, పీ. కృష్ణారెడ్డి, వంగూరు మోహన్ రావు, ఎన్. నరసింహులు వంటి అధికారులు డైరెక్టర్లుగా నియమించబడ్డారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ సరఫరా, భారీ సాగునీటి ప్రాజెక్టులు పెరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ పంపిణీ వ్యవస్థపై భారం పెరుగుతోంది. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయానికి సంబంధించిన విద్యుత్ సరఫరాను ప్రత్యేకంగా నిర్వహించేందుకు 'రైతు డిస్కమ్'ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# తెలంగాణకు భారీ వర్ష సూచన

**స్టేట్ బ్యూరో,మార్చ్ 11(ప్రభాత జాగృతి):** మార్చి నెల ఆరంభంలోనే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఉదయం పది గంటలకే ఎండలు మండిపోతుండటంతో.. మధ్యాహ్నం వేళ జనం బయటకు రావాలంటేనే జంకుతున్నారు. వేసవి తాపం ఇప్పుడే ఇలా ఉంటే.. ముందు ముందు ఇంకెంత తీవ్రంగా ఉంటుందోనని ఆందోళన చెందుతున్న తరుణంలో.. తెలంగాణ వాతావరణ శాఖ రాష్ట్ర ప్రజలకు చల్లని కబురు అందించింది. రాష్ట్రంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల నుంచి త్వరలోనే విముక్తి లభించనుంది. వాతావరణ శాఖ అంచనా ప్రకారం.. ఈ నెల 15వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఎండల తీవ్రత తగ్గి.. పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. మార్చి 14 వరకు ఎండలు ఇలాగే కొనసాగుతాయి. మార్చి 15 నుంచి తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు ప్రారంభమవుతాయి. కొన్ని ప్రాంతాల్లో గంటకు 30-40 కి.మీ వేగంతో వీచే గాలులతో కూడిన జల్లులు పడవచ్చని వాతావరణ శాఖ పేర్కొంది. ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం వంటి ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలకు వాతావరణ శాఖ 'ఎల్లో అలర్ట్' జారీ చేసింది. మార్చి 16, 17 తేదీల్లో కూడా రాష్ట్రంలోని పలుచోట్ల జల్లులు కురిసే అవకాశం ఉండటంతో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడతాయని నిపుణులు భావిస్తున్నారు. ఈ అకాల వర్షాల వల్ల ఎండల నుంచి తాత్కాలికంగా ఉపశమనం లభించినప్పటికీ.. ఉరుములు, మెరుపుల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# ఉమెన్ వెల్నెస్ ప్రొఫైలింగ్ ప్రోగ్రామ్ అమలులో అలసత్వం వహించవద్దని ఆరోగ్యశాఖ మంత్రి :దామోదర్ రాజనర్సింహ

**సిటీ బ్యూరో ,మార్చ్ 11(ప్రభాత జాగృతి):**



రాష్ట్రవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉమెన్ వెల్నెస్ ప్రొఫైలింగ్ ప్రోగ్రామ్ అమలులో అలసత్వం వహించవద్దని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఈ నెల 8వ తేదీన ప్రారంభమైన ఈ బృహత్తర కార్యక్రమ పురోగతి, అమలు తీరుపై బుధవారం ఆయన సెక్రటేరియట్ నుంచి ఆరోగ్యశాఖ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (SERP) అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సెక్రటేరియట్ నుంచి ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తూ, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, డాక్టర్ సంగీత సత్యనారాయణ, ఆరోగ్యశ్రీ సీఈఓ ఉదయ్ కుమార్ పాల్గొనగా.. సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ సహా అన్ని జిల్లాల డీఎంహెచ్వోలు, ఇతర ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ.. టెస్టుల కోసం గ్రామాల నుంచి మహిళలను హాస్పిటల్స్కు తీసుకురావడానికి, పరీక్షల అనంతరం వారిని తిరిగి సురక్షితంగా ఇళ్ల వద్ద దింపడానికి వాహనాలను సమకూర్చాలని సెర్ప్ అధికారులకు సూచించారు. హాస్పిటల్స్లో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ఎక్కువసేపు వేచి ఉండే అవసరం లేకుండా అవసరమైన మేర డాక్టర్లు, సిబ్బందిని అందుబాటులోకి ఉంచుకోవాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు సూచించారు. కుర్చీలు, తాగునీరు, ఇతర సదుపాయాలు కల్పించాలన్నారు. ఒకేరోజు ఎక్కువ మందిని హాస్పిటల్కు తరలించి, వారికి ఇబ్బంది కలిగించొద్దన్నారు. ఒక పద్ధతి ప్రకారం షెడ్యూల్ మెయింటేయిన్ చేయాలని సూచించారు. స్క్రీనింగ్లో ఎవరికైనా అనారోగ్య సమస్యలు ఉన్నట్లు తేలితే, వారికి ఏమాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే చికిత్స ప్రారంభించాలన్నారు. స్క్రీనింగ్ జరిగే అన్ని హాస్పిటళ్లు, దయాగ్నస్టిక్ సెంటర్లలో అవసరమైన మేర సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. మహిళల నుంచి రక్త నమూనాల సేకరణ మొదలుకొని.. వాటిని ల్యాబ్లకు చేర్చే వరకు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, సాంపిల్స్ దెబ్బతినకుండా పక్కాగా కోల్డ్ చైన్ ప్రోటోకాల్స్ మెయింటైన్ చేయాలన్నారు. ల్యాబ్లో నమూనాల వివరాలు (డేటా) ఎంటర్ చేసేటప్పుడు ఎలాంటి తప్పులు దొర్లకుండా చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని మంత్రి హెచ్చరించారు. అన్ని జిల్లాల డీఎంహెచ్వోలు, హాస్పిటళ్ల సూపరింటెండెంట్లు విధిగా క్షేత్రస్థాయిలో పర్యటించి స్క్రీనింగ్ జరుగుతున్న తీరును పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు. ఎక్కడైనా చిన్నపాటి లోపాలు తలెత్తితే, వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, సత్వరమే తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

# చెస్ ద్వారా విద్యార్థుల్లో ఆలోచనశక్తి, ఏకాగ్రత పెరుగుతుంది

**జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్**




**జగిత్యాల, మార్చి11(ప్రభాత జాగృతి ):** చెస్ ద్వారా విద్యార్థుల్లో ఆలోచనశక్తి, ఏకాగ్రత పెరుగుతుందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్కుమార్ అన్నారు. పట్టణంలోని స్థానిక ఓల్డ్ హై స్కూల్లో గ్రేటర్ అట్లంట తెలంగాణ సొసైటీ, చెస్ నెట్వర్క్ వారి ఆధ్వర్యం లో ఎమ్మెల్యే సంజయ్కుమార్ చేతులమీదుగా విద్యార్థులకు చెస్ బోర్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటియుగంలో విద్యార్థులు సోషల్మీడియా, మొబైల్కు బానిస అవుతున్నారని చెస్, క్రీడలు ఆడడం వల్ల చెడు అలవాట్లకు బానిసకాక ండా ఉంటారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన, మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. చద లవుతో పాటు క్రీడలు ముఖ్యమని, ఉపాధ్యాయులు, పోషకులు విద్యార్థులను క్రీడల పట్ల ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులకు చేస్బోర లు పంపిణీ మంచి కార్యక్రమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ సమింద్ల వాణిశ్రీనివాస్, కౌన్సిలర్ ఆరవ ల కీ. హెచ్ఎం చంద్రకళ, పీఆర్టీయూ అధ్యక్షులు ఆనంద్రరావు, అమర్నాద్డ్డి, చెస్ నెట్వర్క్ ఫౌండర్ సుధీర్, గ్రేటర్ అట్లంట తెలంగాణ సొసైటీ అధ్యకుడు గంద్ర వెంకటరమణ, కోఆర్డినేటర్ సురేష్, వేణుగోపాల్రావు, కొలగాని సత్యం, మాజీ కోఆప్షన్ సభ్యులు శ్రీనివాస్, రిటైర్ ఎ నారాయణ, రహీం తోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్పీకర్ తీర్పు ప్రజాస్వామ్యాన్ని అవమానించే తీర్పు

**బిజెపి అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు**



**సిటీబ్యూరో మార్చ్ 11:ప్రభాత జాగృతి :** ఈ రోజు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ ఇచ్చిన తీర్పు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉంది. ఒక వ్యక్తి ఒక పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి, ఆరు నెలల లోపే మరో పార్టీలో చేరి అదే పార్టీ తరఫున లోక్సభకు పోటీ చేయడం మొత్తం రాష్ట్ర ప్రజలు చూసిన విషయమే. ఇంత స్పష్టమైన పరిస్థితులు ఉన్నప్పటికీ దాన్ని పార్టీ ఫిరాయింపుగా పరిగణించలేమని చెప్పడం ఆశ్చర్యకరం. ఒక పార్టీ నుంచి గెలిచిన వ్యక్తి మరో పార్టీ అభ్యర్థికి ప్రచారం చేయడం, అదే పార్టీ తరఫున ఎన్నికల్లో పోటీ చేయడం వంటి స్పష్టమైన రికార్డులు ఉన్నప్పటికీ కూడా ఇది పార్టీ ఫిరాయింపు కాదని చెప్పడం ప్రజాస్వామ్యాన్ని అవమానించే తీర్పు. ఇది ప్రజలు ఇచ్చిన తీర్పును కూడా అగౌరవపరిచినట్లే. యాంటీ డిఫెక్షన్ చట్టాన్ని తీసుకొచ్చింది రాజీవ్ గాంధీ గారే. ఆ సమయంలో రాజ్యాంగ సవరణ ద్వారా ఆ చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. కాబట్టి ఈ అంశంపై రాహుల్ గాంధీ గారు సమాధానం చెప్పాలి. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో అదే యాంటీ డిఫెక్షన్ చట్టం స్పష్టంగా ఉల్లంఘనకు గురవుతున్న పరిస్థితుల్లో స్పీకర్ ఇలాంటి తీర్పు ఇవ్వడం రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కడమే. రాహుల్ గాంధీ గారు... మీరు ఒకవైపు రాజ్యాంగాన్ని కాపాడుతున్నామని చెప్పుకుంటూ తిరుగుతున్నారు. కానీ మరోవైపు మీ పార్టీకి చెందిన నాయకుల చర్యలను సమర్థించే విధంగా ఇలాంటి తీర్పులు రావడం ఎలా సమర్థించగలరు? ఈ రోజు వచ్చిన తీర్పు కేవలం ప్రజాస్వామ్యాన్ని మాత్రమే కాదు, రాజ్యాంగాన్ని మరియు ప్రజల తీర్పును కూడా అగౌరవపర్చడమే, అవమానించడమే. ఈ తీర్పుపై భారతీయ జనతా పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది.

# మెగా ఎడ్యుకేషన్ ఫేర్ను సద్వినియోగం చేసుకోవాలి

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**




**జగిత్యాల , మార్చి11(ప్రభాత జాగృతి):** ఈ నెల 15న కరీంనగర్ పట్టణంలోని టీఎన్జీవో ఫంక్షన్ హాల్ లో తెలంగాణ విద్యాసమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా ఎడ్యుకేషన్ ఫేర్ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. కార్యక్రమ పోస్టర్ ను రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్కుమార్, డా. కల్వకుంట్ల సంజయ్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు గాజెంగి నందయ్య చేతులమీదుగా బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియేట్ విద్య తర్వాత ఉన్నత విద్యా అవకాశాలపై విద్యార్థులకు సరైన అవగాహన కల్పించేందుకు 'మెగా ఎడ్యుకేషన్ పేర్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుం దన్నారు. దేశంలోని ప్రముఖ యూనివర్సిటీలు, విద్యాసంస్థలు పాల్గొనే ఈ ఎడ్యుకేషన్ ఫేర్ ద్వారా విద్యార్థులు వివిధ కోర్సులు, కెరీర్ అవకాశాలు, అడ్మిషన్ ప్రక్రియపై నిపుణుల నుంచి ప్రత్యక్ష సమాచారం పొందవచ్చునన్నారు. విద్యార్థులు, పోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని పెద్దసంఖ్యలో 'పాల్గొని తమ భవిష్యత్కు సరైనదిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో చైతన్య విద్యాసంస్థల చైర్మెన్ మునిపట్ల రాజేందర్, మునిపట్ల దేవేందర్, తెలంగాణ విద్యా సమితి చైర్మెన్ తారక్ గౌడ్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి శ్రీనివాస్, కరీంనగర్ టౌన్ ప్రెసిడెంట్ ప్రవీణ్ రాజ్, రవీందర్, తెలంగాణ విద్యాసమితి నాయకులు, కార్యకర్తలు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# 'భవిష్యత్' కు నిర్ణయం ఎప్పుడు?

- కాంగ్రెస్ పార్టీ తీరుపై అసహనంతో జీ'వనం'
- పార్టీ మార్పు పై జోరుగా ఊహగానాలు.
- పార్టీలో కొనసాగడం కష్టంగా ఉందంటూ ఆవేదన
- మాజీ మంత్రి జీవన్ రెడ్డి నిర్ణయం పై ఉత్కంఠ



హైదరాబాద్, మార్చి 11(ప్రభాత జాగృతి): ముందు వచ్చిన చెవుల కన్న, వెనుక వచ్చిన కొమ్ములే వాడి అన్న నానుడిని నిజం చేసేలా రాష్ట్రం లో కాంగ్రెస్ పార్టీ వ్యవహారం నడుస్తుంది. ఫిరయింపుల చట్టం చేసిన ఆ పార్టీ, ఫిరయింపులపై రాజ్యాంగం పట్టుకొని తిరిగే ఆ పార్టీ అగ్ర నేత ఆశలకు తూట్లు పొడుస్తూ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు పెద్ద పీఠ వేస్తున్నట్లుగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ తీరు స్పష్టం అవుతుంది. ఢిల్లీ లో ఒక నినాదం, రాష్ట్రం లో మరో విధానం అన్నట్లుగా కాంగ్రెస్ పార్టీ కాలం వెళ్ళదీస్తూ వస్తుంది. పార్టీ తీరుపై ఫిరాయింపు నియోజకవర్గం కు చెందిన సీనియర్ క్యాడర్ తీవ్ర అసహనంతో ఉంది. కష్టకాలంలో పదేళ్లు పార్టీని అంటిపెట్టుకొని ఉన్న వాళ్ళను కాదని, అధికారం లోకి వచ్చాక స్వార్థ రాజకీయ ప్రయోజనాలనాకోసం ఎమ్మెల్యే లను పార్టీలోకి ఫిరాయించి, వారికి పెద్దపీట వేస్తూ, పార్టీని నమ్ముకున్న నేతలకు, క్యాడర్ కు తగిన గుర్తింపు, సమూచిత స్థానం ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న వ్యవహారం పై సీనియర్ నేతలు గుర్రుగా ఉన్నారు. దీనికీ ప్రత్యక్ష ఉదాహరణ జగిత్యాల నియోజకవర్గం. ఇది కాంగ్రెస్ పార్టీ కీ కంచుకోట. సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి నియోజకవర్గం. నాలుగున్నర దశబ్దాలుగా పాగవేసి, ఏక ఛత్రాదిపత్యంగా పార్టీని నడుపుతూ, వర్గ విభేదాలు, రాజకీయ మచ్చలేని నాయకునిగా ఆయన సుధీర్ఘ కాలంగా రాజకీయాల్లో కొనసాగుతున్నారు. ఇలాంటి నేత, నియోజకవర్గం లో బిఆర్ఎస్ లో గెలిచినా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పార్టీ అధికారం కోల్పోగానే, కాంగ్రెస్ గూటికి చేరారు. ఇక్కడే అసలు కథ మొదలై, గ్రూప్ రాజకీయాలకీ బీజం వేసింది. పార్టీ క్యాడర్ ఒకవైపు, ఎమ్మెల్యే అనుచర గణం మరోవైపు, గోడమీద పిల్లులు అన్ని వైపులు అన్న చందంగా తయారైంది జగిత్యాలలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి. ఏడాదిన్నరగా పార్టీలో వర్గ విభేదాలు, అసమ్మతి రాగం తార స్థాయికి చేరింది. ఇంత జరుగుతున్న కూడ జీవన్ రెడ్డి తో కాంగ్రెస్ హై కమాండ్ మాట్లాడకపోవడం, వచ్చిన ప్రతినేత తనకెందుకు వచ్చిన తంటా అన్నట్లుగా వ్యవహరిస్తూ జీవన్ రెడ్డి తో మాట్లాడి ఒప్పించి మెప్పించే స్థాయి తమది కాదంటూ జారుకోవడం పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలో నానాటికి కాంగ్రెస్ లో రాజకీయ అంతరం పెరుగుతూ వస్తుంది.

**మున్సిపల్ ఎన్నికల వేళ**

రాష్ట్రం లో మున్సిపల్ ఎన్నికల నగారా మోగాక జగిత్యాల నియోజకవర్గం లో పరిస్థితి మరింతగా దిగజారింది. పార్టీని గత నాలుగున్నర దశబ్దాలుగా అంటిపెట్టుకొని, పార్టీకోసం, నియోజకవర్గం ప్రజలకోసం, క్యాడర్ కోసం పరితపించే జీవన్ రెడ్డి ని కాదని, పార్టీ మారినా, బిఆర్ఎస్ లోనే ఉన్న అని పేర్కొన్నా సంజయ్ కీ టికెట్ల విషయంలో ప్రాధాన్యత ఇవ్వడం పై అసమ్మతి ఆకాశాన్ని అంటింది. జగిత్యాల నియోజకవర్గం లో మొత్తం రెండు మున్సిపాలిటీలు ఉండగా జగిత్యాల మున్సిపాలిటీలో 50 వార్డులు, రాయికల్ మున్సిపాలిటీలో 12 వార్డులు ఉన్నాయి. అయితే టికెట్ల కేటాయింపులో భాగంగా జీవన్ రెడ్డికి జగిత్యాల లో 14, రాయికల్ లో 45 టికెట్ లు కేటాయించి పెద్ద మొత్తంలో సంజయ్ కీ ప్రాధాన్యత ఇస్తూ తన వర్గం నేతలకు టీకేట్ ల కేటాయించడంతో జీవన్ రెడ్డి భగ్గుమన్నారు. పార్టీ తీరును నిరసిస్తూ ఆయనకు వచ్చిన టికెట్ లతో పాటు, టికెట్ లు రానిచోట ఇండిపెండెంట్ అభ్యర్థులను పోటీలో ఉంచి ఏకంగా 9 మంది ఇండిపెండెంట్ లను, 14 లో 8 మంది పార్టీ టికెట్ వచ్చిన అభ్యర్థులను గెలిపించుకొని సత్తా చాటారు. ఎమ్మెల్యే సంజయ్ కు 36 టికెట్ లలో 14 మంది గెలవగా, రాయికల్ లో ఇద్దరు ముగ్గురు గెలిచినట్టు సమాచారం. ఈ ఎన్నిక నేతల బాలబలాలను రుజువు చేసిన, పార్టీ హై కమాండ్ మాత్రం ఎమ్మెల్యే సంజయ్ కే అండగా నిలిచింది. టికెట్ పై గెలిచినా నేతలతో పాటు, ఇండిపెండెంట్ అభ్యర్థులను పార్టీకి అప్పగించి, పార్టీ కోసం కష్టపడ్డ నేతలకు చైర్మన్, వైస్ చైర్మెన్ పదవులు ఇవ్వాలని విజ్ఞప్తి చేసిన అధిష్టానం లెక్క చెయ్యకుండా సంజయ్ వర్గానికి చైర్మన్, జీవన్ రెడ్డి వర్గానికి వైస్ చైర్మన్ ఇచ్చి చేతులు దులుపుకుంది. దీంతో జీవన్ రెడ్డి మరింత అసహనానానికి గురయ్యారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత ఆయన మరింత నైర్యాష్యంలో మునిగిపోయారని సమాచారం.

**భవిష్యత్ కార్యాచరణ ఏంటి?**

నాలుగున్నర దశబ్దాలుగా పార్టీని నమ్ముకొని, రాజకీయ చివర అంకంలో ఇలాంటి గట్టు పరిస్థితి సొంత పార్టీ, సొంత ప్రభుత్వం లో ఎదుర్కోవడం పై ప్రజల్లో సానుభూతికీ దారి తీసింది. అయినా పార్టీ ఆయన సీనియరిటి, సిన్సియారిటి, కమిట్మెంట్ ను పరిగణలోకి తీసుకోకపోవడం పై క్యాడర్ అసహనంలో రగిలిపోగా, ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సీనియర్ నాయకునికి సరైన ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నారు. ఇవన్నీ ఇలా ఉంటే జీవన్ రెడ్డి భవిష్యత్ కార్యాచరణ ఏంటనేది ఎవరికీ అంతుచిక్కడం లేదు. మీడియా, సోషల్ మీడియా మాత్రం ఆయన పార్టీ మార్పు పై పుంకాను పుంకాలుగా వార్తలు ప్రసారం చేస్తూ అటు ప్రజలను, ఇటు క్యాడర్ ని కన్ఫ్యూజ్ చేస్తున్నారు. తాజాగా జరిగిన విలేకరుల సమావేశం పార్టీ మార్పు పై జీవన్ రెడ్డిని విలేకరులు అడుగగా, మున్సిపల్ ఎన్నికల నుంచి తాను నైరాశ్యంలో ఉన్నట్లు తెలిపారు. పార్టీ మార్పు అంశం మీకు తెలియకుండా జరుగుతుంద అని నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. దీనిపై ప్రస్తుతం జగిత్యాల జిల్లాలో జోరుగా చర్చ సాగుతుంది. ఈ నేపథ్యంలో జీవన్ రెడ్డి నిర్ణయం ఏలా ఉండబోతుంది అనేది తీవ్ర ఉత్కంఠ కు తెరలేపింది. పార్టీ మారుతారా? పార్టీలోనె ఉంటారా అనేది కాలమే నిర్ణయించాలి.

**క్యాడర్ సతమతం:**

సీనియర్ నేత జీవన్ రెడ్డి కీ మంకు, మొండి పట్టు ఎక్కువ. అవకాశం కొరకు ఎదిరిచూడడం, అవకాశాలు దక్కించుకునే వరకూ మౌనంగా పోరాటం చేయడం సాధించడం ఆయన జీవితంలో పరిపాటి. ఆయన రాజకీయ జీవితం లో ఎదురుకున్న ప్రతి ఓటమి, ఇబ్బంది తర్వాత ఆయనను విజయపథంలో నడిపించాయి. ఇప్పుడున్నా గట్టు కాలం కూడా అదే పరిస్థితి కీ దారి తీస్తుందా అనేది మిలియన్ డాలర్ ల ప్రశ్న. జీవన్ రెడ్డి అనుభవం కు ఉన్న ఓపిక క్యాడర్ కు ఉంటుందా అనే కోణంలో సైతం పెద్దాయన ఆలోచన చెయ్యాల్సిన అవసరం ఉంది. 2009 జీవన్ రెడ్డి వివిధ పదవుల్లో గెలిచిన కూడా క్యాడర్ మాత్రం అధికారం కు దూరంగా ఉంది. ఈ విషయం జీవన్ రెడ్డి కీ అలవాటు అయినట్టుగా క్యాడర్ కావాలంటే కాస్త ఇబ్బంది అని ఆయన ఆలోచన చెయ్యాల్సినా అవసరం ఉంది. ప్రస్తుతం ఆయన తీవ్ర నైరాశ్యం లో ఉన్నారు. పైకి గంభీరంగా ఉన్న లోపల మదన పడుతున్న విషయం క్యాడర్ ను నిరాశకు గురి చేస్తుంది. జీవన్ రెడ్డి తో పాటు పదేళ్లుగా, ఆపైగా జెండా మోసిన నాయకులు ప్రస్తుతం పార్టీ అధికారం లోకి వచ్చాక వారికి ఆశించిన ఫలాలు దక్కడం లేదు. పార్టీ మారి కాంగ్రెస్ పంచన చేరడంతో ఆయనకు పార్టీ, ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుంది. కానీ ఏళ్లుగా పార్టీ కోసం శ్రమించి, జెండా మోసిన క్యాడర్ ను మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే అంశాన్ని జీవన్ రెడ్డి సైతం పలుమార్లు వ్యక్త పరిచ్చారు. నాపై కోపం నన్ను ఇబ్బంది పెట్టండి తప్ప, క్యాడర్ ను ఇబ్బందికీ గురి చెయ్యకండని, వారి కష్టానికి తగిన గుర్తింపు ఇవ్వమని పదే పదే అధిష్టానం ను, ప్రభుత్వం ను వేడుకుంటున్నారు. అయినా వారెవరు ఆయన వ్యాఖ్యలను లెక్కచెయ్యడం లేదనే భావన క్యాడర్ లో నుంచి వ్యకమవుతుంది. జీవన్ రెడ్డి కీ వెన్నటి ఉన్న క్యాడర్ కోసం అయినా గట్టిగ పట్టు పట్టి న్యాయం చేయడమా? గడప దాటడమా అనేది ఆయన నిర్ణయించుకోవాల్సిన సమయం ఆసన్న మైంది. చూద్దాం జీవన్ రెడ్డి నిర్ణయం ఏలా ఉంటుందో, క్యాడర్ కోసం ఆయన చేసే ప్రయత్నం ఎటు వైపు దారి తీస్తుందో తెలియాలి అంటే కాసిన్ని రోజులు ఆగల్సి వస్తుందేమో... వేచి చూడాలి మరీ.

## బి.ఎల్.ఓ ల యాప్‌లో ఓటర్ల మ్యాపింగ్ తప్పనిసరి

**డిప్యూటీ తహసీల్దార్ యజ్ఞంబట్ల మానస**



**రామగిరి : మార్చి 11: (ప్రభాత జాగృతి):** కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్(ఎస్ఐఆర్) యాప్ లో ఓటర్ల మ్యాపింగ్ తప్పనిసరని రామగిరి డిప్యూటీ తహసీల్దార్ యజ్ఞంబట్ల మానస అన్నారు. రామగిరి మండలం రత్నాపూర్ గ్రామ పంచాయితీ ఆవరణలో బుధవారం ఎస్ఐఆర్ యాప్ పై బిఎల్ఓ లకు అవగాహన కల్పించారు. సర్పంచ్ పల్లె ప్రతిమ పిచీరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఆమె హాజరయ్యారు. రామగిరి మండలంలో 15 గ్రామ పంచాయితీలలో 42 మంది బిఎల్ఓ లు పనిచేస్తున్నారని ఆమె తెలిపారు. బీహార్, ఉత్తరప్రదేశ్ లో ఈ యాప్ ద్వారా ఓటర్ల మ్యాపింగ్ జరిగిందన్నారు. 2002 సంవత్సరం తరువాత ఓటర్ల లిస్ట్ లో ఉన్న వారిని గుర్తించి స్థానికంగా ఉంటే మ్యాపింగ్ చేయాలని సూచించారు. స్థానిక గ్రామాల్లో కోడళ్ళుగా వచ్చిన వారి ఓటు ఉంటే వారి తల్లితండ్రుల గ్రామంలో ఎపిక్ నెంబర్ ఉంటే చూసి మ్యాపింగ్ చేయాలన్నారు. త్వరలో ఈ యాప్ క్లోజ్ అవుతే ఇబ్బందులు ఏర్పడుతాయని, దీనిని దృష్టిలో ఉంచుకొని బిఎల్ఓ లు త్వరగతిన మ్యాపింగ్ చేయాలనీ ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో జీపీవో పెరుక వెంకటేశ్వర్లు, రికార్డ్ అసిస్టెంట్ వరలక్ష్మి, బిఎల్ఓ లు కొండపర్తి శ్రీనివాస్, గడ్డం సునీత, పంజా శాంత, అంగురి విజయలక్ష్మి, మేడ స్వరూప, ఫీల్డ్ అసిస్టెంట్ సందవేన జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## జేఎన్టీయూ కళాశాల బ్లాక్ 2 ఆడిటోరియం ప్రారంభోత్సవం

- విద్యార్థులు సాంకేతిక విషయ పరిజ్ఞానంపై పట్టు సాధించాలి
- రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- మంథని జేఎన్టీయూలో 14వ వార్షికోత్సవం



**రామగిరి, మార్చి 11: (ప్రభాత జాగృతి):** విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక విద్యను అలవర్చుకొని.. విషయ పరిజ్ఞానంపై పట్టు సాధించే దిశగా ముందుకు సాగాలని తెలంగాణ రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సెంటినరీ కాలనీలోని మంథని జేఎన్టీయూహెచ్ 14వ వార్షికోత్సవంతో పాటు, అకాడమీ బ్లాక్ 2 లో నూతన ఆడిటోరియంను ప్రారంభోత్సవానికి విచ్చేసిన మంత్రి శ్రీధర్ బాబు కు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ టి కిషన్ కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ కే వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్, విష్ణువర్ధన్ రెడ్డిలు పూల బోకే అందించి స్వాగతించారు. వేద పండితులు మంత్రోచ్ఛారణతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆడిటోరియంను ప్రారంభించారు. కళాశాల వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఏఐపై కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు అవగాహన పెంచుకొని విషయ పరిజ్ఞానంపై పట్టు సాధించాలన్నారు. కళాశాల సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో జనరేటివ్ ఏఐ అండ్ డేటా సైన్సెస్ మూడు రోజులపాటు వర్క్ షాప్ నిర్వహించి విద్యార్థులకు నూతన సాంకేతిక విద్యలపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా భవిష్యత్తులో మంచి అవకాశాలు పొందవచ్చన్నారు.

**కళాశాల అభివృద్ధికి ప్రతిపాదనలు..**

నూతన నిర్మాణానికి ప్రతిపాదనలు, టిసిఎస్ దిగ్గజం ఒప్పందం, 93 మంది విద్యార్థుల ప్లేస్ మెంట్ అవకాశాలపై మంత్రి శ్రీధర్ బాబుకు విన్నవించారు. ముఖ్యంగా పలు అభివృద్ధి పనులను ప్రతిపాదనలను మంత్రి ముందు ఉంచారు. ప్రిన్సిపాల్ అతిధి గృహం, స్టాఫ్ క్వార్టర్ల నూతన నిర్మాణం, నూతన పరిపాలన భవనం, పెద్ద ఆడిటోరియ భవనం, సోలార్ ఏర్పాటులాంటి అంశాలను జెఎన్ టియుహెచ్ ప్రిన్సిపాల్ బి.విష్ణువర్ధన్ మంత్రి దృష్టికి తీసుకెళ్లగా, మంత్రి సానుకూలంగా స్పందించారు. మంత్రి ఆదేశాలతో ప్రఖ్యాత కంప్యూటర్ దిగ్గజ సంస్థ టిసిఎస్ గత ఏడాది ఒప్పందం ప్రకారం ప్రతి ఏటా వంద మంది విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇచ్చి ప్లేస్ మెంట్ ఇవ్వాలని కోరారు. 2025లో, 2026 మొదటి సంవత్సరం 97 మంది విద్యార్థులు ఎంపిక కావడం సంతోషంగా ఉందని, మంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మెడల్స్ అందించారు. వార్షికోత్సవ వేడుకల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి.అనంతరం మంత్రి కళాశాల అభివృద్ధి కార్యక్రమాలు, ఇతర విషయాలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థ ఆర్ జి త్రీ జీఎం సుంకర మధుసూదన్, పెద్దపల్లి డీసీపీ భూక్యారాంరెడ్డి, గోదావరిఖని ఏసిపి మడత రమేష్, మంథని సిఐ రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తిరుపతి యాదవ్ , కమాన్ పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజు, పన్నూరు సర్పంచ్ చిందం మహేష్, రామగిరి ఎస్సై టి శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ ప్రిన్సిపాల్ ఉదయ్ కుమార్, పరిపాలనాధికారి సుమన్, అధ్యాపకులు, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కేటీఆర్ వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధం

**ప్రజాస్వామ్యాన్ని మరిచిన బీఆర్ఎస్ నాయకత్వం.. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ**



**పెద్దపల్లి :మార్చి 11(ప్రభాత జాగృతి) :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ *కె. టి. రమణ రావు* ("ట్విట్టర్ టిల్లు") బుధవారం నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో *రాహుల్ గాంధీ* పై చేసిన వ్యాఖ్యలు పూర్తిగా వాస్తవాలకు విరుద్ధమని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ప్రకటన లో ఖండించారు. 2019లో అధికార అహంకారంతో అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం పోలీస్ వ్యవస్థను ఉపయోగించి కాంగ్రెస్ పార్టీకి చెందిన దాదాపు 10-12 మంది ఎమ్మెల్యేలను తమ పార్టీలోకి చేర్చుకున్న విషయం ప్రజలకు స్పష్టంగా గుర్తుందని వంశీ కృష్ణ అన్నారు. రాజ్యాంగ విరుద్ధ ఒత్తిడులు, అధికార దుర్వినియోగం చేసి ప్రతిపక్షాలను బలహీనపరచడం అప్పటి పాలనలో సాధారణమైందని ఆయన విమర్శించారు. అలాగే మున్సిపల్ మరియు సర్పంచ్ ఎన్నికల సమయంలో అనేక ప్రాంతాల్లో సరైన పోటీ జరగకుండానే బీఆర్ఎస్ అభ్యర్థులను ఏకగ్రీవంగా గెలిచినట్లు ప్రకటించిన ఘటనలు కూడా ప్రజలు మరచిపోలేదని ఆయన తెలిపారు. మన దేశం బి ఆర్ అంబేద్కర్ ఇచ్చిన రాజ్యాంగం ఆధారంగా నడుస్తుందని, ప్రజాస్వామ్య విలువలను కాపాడే బాధ్యత ప్రతి నాయకుడిపై ఉందని వంశీ కృష్ణ అన్నారు. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించిన నాయకులను ప్రజలు ఇప్పటికే తిరస్కరించారని చెప్పారు. ప్రస్తుతం కొందరు నాయకులు చిల్లర రాజకీయాలు చేసి మీడియా దృష్టిని ఆకర్షించడానికి ప్రయత్నిస్తున్నారని, కానీ తెలంగాణ ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని ఆయన అన్నారు. ప్రజల తీర్పే చివరికి నిర్ణయాత్మకమని వంశీ కృష్ణ స్పష్టం చేశారు.

## రంజాన్ తొఫా ను పంపిణీ చేసిన హుగ్గేల్లీ గ్రామ సర్పంచ్ పట్లోళ్ళ విమల శ్రీనివాస్ రెడ్డి

**జహీరాబాద్:మార్చి11(ప్రభాత జాగృతి):** హుగ్గేల్లీ గ్రామంలో బుధవారం మైనార్టీలకు తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న తోఫా కిట్లను హుగ్గేల్లీ గ్రామ సర్పంచ్ పట్లోళ్ళ.విమల శ్రీనివాస్ రెడ్డి తన చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం,ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి ముస్లిం మైనార్టీల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని అని పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో గ్రామ పంచాయితీ వార్డు సభ్యులు,కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలనప్రగతి ప్రణాళిక ప్రోగ్రాంలో ప్రజా ప్రతినిధులు భాగస్వామ్యం కావాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**




**పెద్దపల్లి, మార్చి 11:(ప్రభాత జాగృతి):** ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలనప్రగతి ప్రణాళిక ప్రోగ్రాంలో నూతనంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులు భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. బుధవారం రంగపూర్ లోని రాధాకృష్ణ ఏసీ కన్వెన్షన్ హాల్ లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశము పై స్థానిక సంస్థ ప్రజా ప్రతినిధులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష , రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా *జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ* నూతనంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులు జూన్ 12 వరకు జరిగే 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొంటూ క్షేత్రస్థాయి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుని వచ్చి పరిష్కరించే దిశగా కృషి చేయాలని , ప్రజాప్రతినిధులు అధికారుల తో కలిసి సమన్వయంతో పని చేయాలన్నారు. మార్చి 15 లోపు వివిధ శాఖలలో చాలా కాలంగా పెండింగ్ ఉన్న ఫైల్స్ పరిష్కారం కోసం చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో దాదాపు 6 లక్షల 80 వేల జనాభాకు రేషన్ బియ్యం ప్రభుత్వం సరఫరా చేస్తుందని, అర్హులందరికీ రేషన్ కార్డులు జారీ అయ్యాయని తెలిపారు. నూతన రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ కొనసాగిస్తున్నామని, మీ సేవా ద్వారా దరఖాస్తు చేసుకుంటే విచారించి రేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు తెలిపారు. ప్రతి శాఖ సంబంధించి పని తీరు ప్రజా ప్రతినిధులకు శిక్షణ కార్యక్రమంలో తెలుస్తుందని, ప్రజా ప్రతినిధులకు ఉన్న సందేహాలను నివృత్తి చేసుకోవాలని అన్నారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం ద్వారా ఇండ్ల పై సోలార్ ప్యానల్స్ ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారని, ప్రజా ప్రతినిధులు దీనిపై అవగాహన పెంచుకొని గ్రామ, పట్టణ స్థాయిలో దీనిని అమలు చేసేందుకు ప్రజలు ముందుకు వచ్చేలా ప్రచారం చేయాలని ఆయన కోరారు.

## రాష్ట్రంలో ఎక్సైజ్ శాఖకు మంత్రి ఉండ లేడా




సిటీ బ్యూరో:మార్చ్ 11: ప్రభాకర్ జాగృతి

తెలంగాణ భవన్లో మాజీ మంత్రి శ్రీనివాస గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం విధ్వంసమే పనిగా పెట్టుకుంది. ఒక దేశం మరొక దేశం పై దండయాత్ర చేసినట్లు , కులవృత్తులు పై దాడి చేస్తున్నారు. కేసీఆర్ హయంలో కుల వృత్తులను కాపాడుకోవడం జరిగింది. కాంగ్రెస్ మేనిఫెస్టో లో కుల వృత్తులకు ఎన్నో హామీలు ఇచ్చినా ఒక్క హామీ నెరవేర్చ లేదు గీత కార్మికులు ప్రమాదశావత్తు మరణిస్తే ఎక్స్ గ్రేషియా పది లక్షలు ఇస్తామన్నారు ఇప్పటి దాకా 20 కోట్ల రూపాయలు పెండింగ్ లో ఉంది ఆ డబ్బు చెల్లించడానికి కూడా కమిషన్లు కావాలా కేసీఆర్ హయం లో ఐదు లక్షల ఎక్స్ గ్రేషియా సకాలం లో వచ్చేది ..కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడింది అన్నట్టు తయారైంది రాష్ట్రం లో పరిస్థితి ...కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నగరం నడి బొడ్డున 10 కోట్ల రూపాయలతో నీరా కేఫ్ ఏర్పాటు చేశాము. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత నీరా కేఫ్ ఎత్తేసే పనిలో ఉంది నీరా కేఫ్ ను ప్రైవేట్ పరం చేస్తున్నారు గతంలో మేము అడ్డుకోవడంతో ఆపేశారు, ఇప్పుడు మళ్ళీ నీరా కేఫ్ ను ప్రవేట్ పరం చేసేలా ప్రణాళికలు చేస్తున్నారు.ఇందుకు నోటిఫికేషన్ కూడా ఇచ్చారు నీరా కేఫ్ నేచురల్ గా ఉంటుంది, పిల్లలతో సహా నీరా తాగొచ్చు, కూల్ డ్రింక్స్ తో అనేక ఇబ్బందులు ఉంటాయి. అందుకే నీరా కేఫ్ ను నగరం నడిబొడ్డున బిఆర్ఎస్ హయంలో ఏర్పాటు చేశాము. నందనం లో వంద శాతం పూర్తి అయిన నీరా ఉత్పత్తుల కేంద్రాన్ని ఈ ప్రభుత్వం ఓపెన్ చెయ్యడం లేదు. రాష్ట్రం లో ఎక్సైజ్ శాఖకు మంత్రి ఉండా లేడా అని అనుమానం కలుగుతుంది. వైన్స్ షాపులను సొసైటీకి కొంత శాతం కేటాయిస్తామని చెప్పి మోసం చేశారు. ఒక కోటి యాభై లక్షల తాటి చెట్లు మా హయంలో పెట్టాము. పెట్టిన తాటి చెట్లను కాపాడుకునే ప్రయత్నం ఈ ప్రభుత్వం చెయ్యడం లేదు. ఎన్నికల సమయంలో గౌడన్నలకు కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చింది. గౌడన్నలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేక పోయారు. నీరా ఉత్పత్తి కేంద్రాలు ఎలా నడిపించాలో మమ్మల్ని అడిగితే చెప్తాము. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ నీరా కేఫ్ లను కాపాడుకునే ప్రయత్నం చెయ్యాలి. నీరా కేఫ్ లను నిర్లక్ష్యం చేస్తే ఊరుకునేది లేదు. నీరా కేఫ్ ల వల్ల 10 కులాలకు పని దొరుకుతుంది. నీరా కేఫ్ ను ప్రైవేటు పరంగా చేయకుండా గీత పారిశ్రామిక సహకార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆధ్వర్యంలోనే నడపాలి అన్నికుల వృత్తులకు పని దొరికే నీరా కేంద్రాలను కాపాడుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు నాగేందర్ గౌడ్ ,పల్లె రవికుమార్ గౌడ్ ,బీసీ కమిషన్ మాజీ సభ్యులు కె .కిషోర్ గౌడ్ ,ఉపేంద్ర చారి పాల్గొన్నారు

## ఎల్పీజీ, యూరియా సమస్యలపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలి

**పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ**

**పెద్దపల్లి;మార్చి 11 (ప్రభాత జాగృతి)**



దేశవ్యాప్తంగా ఎల్పీజీ గ్యాస్, యూరియా సరఫరా సమస్యలు తీవ్రరూపం దాల్చుతున్నాయని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల సమస్యల పట్ల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ, గత సంవత్సరం యూరియా సరఫరాలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా మిస్మేనేజ్‌మెంట్ చేయడం వల్ల తెలంగాణ రైతాంగం తీవ్రంగా నష్టపోయిందన్నారు. ఇప్పుడు కూడా అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో ఎల్పీజీ, ఎల్ఎన్జీ సరఫరాలో సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, దాని ప్రభావం యూరియా సరఫరాపై కూడా పడే ప్రమాదం ఉందని చెప్పారు. విదేశాంగ విధానంలో స్పష్టమైన దారి లేకుండా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. విదేశాంగ మంత్రి డా. ఎస్. జైశంకర్ మరియు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తగిన విధంగా చర్యలు తీసుకోకపోతే దేశవ్యాప్తంగా యూరియా కొరత మరింత పెరిగే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ పరిస్థితి కొనసాగితే తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉందని హెచ్చరించిన ఎంపీ వంశీకృష్ణ, వెంటనే సమస్యను పరిష్కరించేలా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మరియు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జె.పి. నడ్డా స్పందించాలని డిమాండ్ చేశారు.

## ఉపవాస దీక్షాపరులకు ఇఫ్తార్ విందు మెహరాజ్ ఖాన్





**కమాన్‌పూర్,మార్చి 11: (ప్రభాత జాగృతి):** రంజాన్ మాసం సందర్భంగా కమాన్‌పూర్ మండల కేంద్రానికి చెందిన ముస్లిం మైనార్టీ నాయకుడు మెహరాజ్ ఖాన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. కమాన్‌పూర్‌కు చెందిన కీర్తిశేషులు మొహమ్మద్ ఖాన్ కుమారుడు అయిన మెహరాజ్ ఖాన్, పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాసం పాటిస్తున్న ముస్లిం సోదరుల కోసం నెల పొడవునా ఇఫ్తార్ విందులు ఏర్పాట్లు చేయడం ఆయన సంకల్పం ఆదర్శనీయం. కమాన్‌పూర్, గుండారం, రొంపికుంట ప్రాంతాల్లోని మస్జిద్‌లలో రోజా ఉన్నవారికి ఇఫ్తార్ కోసం పండ్లు, ఫలాహారాలు పంపిణీ చేస్తున్నారు. ఉపవాసం ముగించుకునే సమయానికి అవసరమైన ఆహారాన్ని అందిస్తూ ముస్లిం సోదరులకు సాయంగా నిలుస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం గుండారం గ్రామ మస్జిద్‌లో ముస్లిం యువత ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మెహరాజ్ ఖాన్ సేవలను గుర్తిస్తూ గుండారం మస్జిద్ యువకులు ఆయనను ఘనంగా సన్మానించారు. సమాజ సేవలో ముందుండి ముస్లిం సోదరులకు సహాయం చేస్తున్నందుకు పలువురు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో మతీన్ ఖాన్, షేర్ ఖాన్, జలీల్, సయ్యద్ కలీం, చోటు, జాకీర్ గౌస్, షకీల్, ఎండి సద్దాం, షోయబ్, ముజాహిద్, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు. రంజాన్ మాసంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో సౌహార్దాన్ని పెంపొందిస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు.

## పంప్ ఆపరేటర్ సేవలకు సన్మానం

**ఇంటర్నేషనల్ పంప్ ఆపరేటర్ డే సందర్భంగా మేడగొని శ్రీనివాస్ గౌడ్ కు సత్కారం**

**కమాన్‌పూర్,మార్చి 11: (ప్రభాత జాగృతి):** కమాన్‌పూర్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఇంటర్నేషనల్ పంప్ ఆపరేటర్ డే సందర్భంగా బుధవారం గ్రామపంచాయతీలో పంప్ ఆపరేటర్ గా విధులు నిర్వర్తిస్తున్న మేడగొని శ్రీనివాస్‌ను సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ, "గ్రామ ప్రజలకు తాగునీరు సరఫరా లో నిరంతరం అందేలా కష్టపడుతున్న పంప్ ఆపరేటర్ల సేవలు ఎంతో గొప్పవని. వారి శ్రమ వల్లే గ్రామంలో నీటి సరఫరా సక్రమంగా కొనసాగుతోందని ఇలాంటి సేవాభావం కొనసాగాలి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొని మేడగొని శ్రీనివాస్ గౌడ్ కు అభినందనలు తెలిపారు. గ్రామానికి సేవ చేస్తున్న సిబ్బందిని ప్రోత్సహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.



ఇది ప్రజా సమస్యల... పరిష్కార సారథి
ప్రభాత జాగృతి
ప్రజా చైతన్య... రథ సారథి

www.prabhathajagruthi.com
Follow :

## విడాకులు తీసుకున్న

# నటి హన్సిక

తెలుగు ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని నటి హన్సికా మోత్వానీ. దేశముదురు సినిమాతో హీరోయిన్‌గా సిల్వర్ స్క్రీన్‌పై మెరిసిన ఈ భామ తెలుగు, తమిళంతోపాటు పలు భాషల్లో స్టార్ హీరోలతో కలిసి నటించి బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకుంది. హన్సిక ప్రొఫెషనల్ లైఫ్‌లో సక్సెస్‌ఫుల్ జర్నీ కొనసాగిస్తూనే 2022 డిసెంబర్ 4న జైపూర్‌లో హిందూ సంప్రదాయ పద్ధతిలో జరిగిన వివాహ వేడుకలో సోహైల్ ఖటురియాతో కలిసి ఏడడుగులు వేసింది. కాగా పరస్పర అంగీకారంతో తాను భర్త నుంచి విడిపోవాలని కోరుతూ హన్సిక కోర్టును ఆశ్రయించింది. ఈ మేరకు ముంబైలోని బాంద్రా ఫ్యామిలీ కోర్టు హన్సికకు విడాకులు మంజూరు చేసింది. సోహైల్ ఖటురియా, హన్సికా మధ్య అభిప్రాయపరంగా, జీవన శైలి పరంగా చాలా వ్యత్యాసాలున్నాయి. ఇద్దరూ తరచూ గొడవలు పడుతూ ఇక కలిసి ఉండలేమని చెబుతూ వచ్చారు. వారి బంధువులు, తల్లిదండ్రులు ఇద్దరినీ కలిపేందుకు చాలా ప్రయత్నాలు చేశారు. కానీ వారి ప్రయత్నాలు ఫలించలేదు. హన్సిక-సోహైల్ జులై 2024 నుంచి విడివిడిగా ఉంటున్నారు. కోర్టు వారికి విడాకులు మంజూరు చేసిందని హన్సిక తరపు లాయర్ అద్నాన్ షేక్ వెల్లడించారు. హన్సిక భర్త నుంచి ఎలాంటి భరణం డిమాండ్ చేయలేదని సమాచారం.

